నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | శుక్రవారం 31-12-2021 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :28 | సంచిక: 123 | పేజీలు:4 | వెల: రూ.1/-

కశ్మీర్‌లో ఎన్‌కౌంటర్.. ఆరుగురు ఉగ్రవాదుల హతం..

న్యూఢిల్లీ, డిసెంబర్ 30:జమ్మూ కశ్మీర్‌లోని అనంత్‌నాగ్, కుల్గాం జిల్లాల్లో జరిగిన రెండు వేర్వేరు ఎన్‌కౌంటర్లలో నిషేధిత ఉగ్రవాద సంస్థ జైషే మహ్మద్ (జెఇఎం)కి చెందిన ఆరుగురు ఉగ్రవాదులు హతమయ్యారు. చనిపోయిన వారిలో నలుగురు ఉగ్రవాదులను మాత్రమే గుర్తించినట్లు సమాచారం. ఈ మేరకు కశ్మీర్‌లోని ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ ట్విటర్‌లో వెల్లడించింది.

"రెండు వేర్వేరు ఎన్‌కౌంటర్లలో నిషేధిత ఉగ్రవాద సంస్థ జెఇఎమ్‌కి చెందిన ఆరుగురు ఉగ్రవాదులు హతమయ్యారు. మరణించిన ఉగ్రవాదుల్లో ఇద్దరు పాకిస్తాన్ కు చెందిన వారు కాగా.. మరో ఇద్దరు స్థానిక ఉగ్రవాదులు. మరో ఇద్దరు ఎవరనేది భద్రతా బలగాలు పరిశీలిస్తున్నాయి. మాకు ఇది పెద్ద విజయం" అని కశ్మీర్ జోన్ పోలీసులు ట్వీట్ చేశారు.

గోరటి వెంకన్నకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు

హైదరాబాద్, డిసెంబర్ 30: 2021 ఏడాదికి తెలుగు సాహిత్యంలో ఎంపికయ్యారు గోరటి వెంకన్న. ఈ సందర్భంగా ఆయనకి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డును ప్రదానం చేయనున్నారు. వల్లంకి తాళం సాహిత్యానికి గోరటి వెంకన్నకు ఈ అవార్డును ప్రకటించారు. గోరటి వెంకన్న ప్రముఖ ప్రజాకవి, గాయకుడు. పల్లె ప్రజలు, ప్రకృతి ఆయన పాటలకు మూలాధారాలు. రేలా రె రేలా కార్యక్రమానికి సుద్దాల అశోక్ తేజతో కలిసి న్యాయనిర్ణేతగా వ్యవహరించాడు. 2016లో తెలంగాణ భాషా దినోత్సవం సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం నుండి కాళోజీ సాహిత్య పురస్కారాన్ని అందుకున్నాడు.

ఇది తెలంగాణ మట్టి మనిషికి దక్కిన గౌరవం: కేసీఆర్

హైదరాబాద్, డిసెంబర్ 30:గోరెటి వెంకన్నకు లభించిన 'కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డును తెలంగాణ మట్టి మనిషికి దక్కిన గౌరవంగా సీఎం కేసీఆర్

అభివర్ణించారు. ప్రముఖ కవి, జానపద గాయకుడు, వాగ్గేయకారుడు, ఎమ్మెల్సీ సభ్యుడు గోరెటి వెంకన్నకు ప్రతిష్టాత్మక 'కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు - 2021' దక్కడం పట్ల సీఎం కేసీఆర్ హర్షం వ్యక్తం చేశారు. 'వల్లంకి తాళం'అనే కవితా సంపుటికి కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు దక్కడం గొప్ప విషయమన్నారు. గోరెటి వెంకన్నకు ఈ సందర్భంగా ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

దైనందిన జీవితంలోని ప్రజా సమస్యలను సామాజిక తాత్వికతతో కండ్లకు కడుతూ వెంకన్న అందించిన సాహిత్యం ప్రపంచ మానవుని వేదనకు అద్దం పడుతుందని సీఎం అన్నారు. మానవ జీవితానికి, ప్రకృతికి వున్న అవినాభావ సంబంధాన్ని... మనిషికి, ఇతర జంతు పక్షి జీవాలకు ఉన్న అనుబంధాన్ని గోరెటి అత్యున్నతంగా ఆవిష్కరించారని సీఎం కొనియాడారు.

తెలంగాణ మట్టి వాసనలను తన సాహిత్యం ద్వారా వెంకన్న విశ్వవ్యాపితం చేశారని సిఎం అన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో కవిగా తన సాహిత్యం ద్వారా గొప్ప పాత్ర పోషించారని తెలిపారు. గోరెటి సాహిత్యానికి దక్కిన ప్రతిష్టాత్మక సాహితీ గౌరవం, తెలంగాణ మట్టి మనిషి జీవనతాత్వికకు దక్కిన గౌరవంగా సిఎం పేర్కొన్నారు.

5 రాష్ట్రాల ఎన్నికలపై ఎన్నికల సంఘం కీలక నిర్ణయం

హైదరాబాద్, డిసెంబర్ 30:వచ్చే ఏడాది జరగనున్న ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి కేంద్ర ఎన్నికల సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. షెడ్యూల్ ప్రకారమే ఐదు రాష్ట్రాల ఎన్నికలు జరుగుతాయని సీఈసీ స్పష్టం చేసింది. దేశంలో కోవిడ్, ఒమిక్రాన్ కేసులు కేసులు పెరగడంతో ఏడాది ఫిబ్రవరిలో జరిగే ఐదు రాష్ట్రాల ఎన్నికలు వాయిదా పడే అవకాశం ఉందంటూ గత కొద్ది రోజులుగా ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం దీనిపై స్పష్టత ఇచ్చింది. కొవిడ్ నిబంధనల ప్రకారం ఎన్నికలు నిర్వహించేందుకు సిద్ధమవుతోంది. ఇందుకు సంబంధించిన వివరాలను ప్రధాన ఎన్నికల కమిషనర్ సుశీల్ చంద్ర వెల్లడించారు.

రాజకీయ పార్టీలన్నీ సమయానికే ఎన్నికలు నిర్వహించాలని కోరాయని సీఈసీ తెలిపారు.

కోవిడ్-19 నిబంధనలను అనుగుణంగా ఎన్నికలు నిర్వహించాలని సూచించారని సుశీల్ చంద్ర చెప్పారు. కోవిడ్ పరిస్థితులుతో ఓటర్లు భౌతిక దూరం పాటించేలా పోలింగ్ కేంద్రాల సంఖ్యను పెంచుతామని వెల్లడించారు. ఉత్తర్ ప్రదేశ్ లో అన్ని ఓటింగ్ బూత్‌ల వద్ద వీవీ పాట్ లను ఏర్పాటు చేస్తామన్నారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతను నిర్ధారించడానికి దాదాపు లక్ష పోలింగ్ బూత్‌లలో ప్రత్యక్ష వెబ్ కాస్టింగ్ సౌకర్యాలు అందుబాటులో ఉంచుతామని చెప్పారు.

కాగా, వచ్చే ఏడాది ఉత్తరప్రదేశ్, పంజాబ్, గోవా, ఉత్తరాఖండ్, మణిపూర్ రాష్ట్రాలకు అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఫిబ్రవరి- మార్చి నెలల్లో ఎన్నికలు ఉండే అవకాశం ఉంది. ఎన్నికల షెడ్యూలు జనవరి 7 నుంచి 10వ తేదీ వరకు వెలువడే అవకాశం ఉంది.

ఇప్పటికే ఎన్నికల సంఘం అధికారులు కోవిడ్ పరిస్థితులను తెలుసుకునేందుకు కేంద్ర వైద్యారోగ్య శాఖతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎన్నికలు జరిగే రాష్ట్రాల్లో వ్యాక్సినేషన్ ప్రక్రియ వేగవంతం చేయాలని ఇప్పటికే ఆదేశించారు.

మరోవైపు ఒమైక్రాన్ వైరస్ వ్యాప్తి వల్ల ఎన్నికలను ఒకటి లేదా రెండు నెలలు వాయిదా వేయాలని అలహాబాద్ హైకోర్టు ఇటీవలే ఈసీని కోరింది. ఎన్నికల సభలు, ర్యాలీలు నిషేధించాలని కూడా కేంద్రాన్ని అభ్యర్థించింది.

చరిత్రలో నేటినిజం

తేయాకు దాదరుకు దగుచును
మొలకు గనవట్టి కష్టములనెరిగింపన్
నాదరుకమటాయుగ "ఆర్కా
రాయుగా మూర్తి" నలంచి ప్రస్తుతిజేతున్ !!

(డిసెంబర్ 31 ఎర్రచిత్రాల నటుడు నారాయణమూర్తి పుట్టిన రోజు....)

-రాధశ్రీ
సెల్: 9494481210

యూపీ ఎన్నికలు, కొవిడ్ పరిస్థితులపై ఎలక్షన్ కమిషన్ సమీక్ష..

న్యూఢిల్లీ, డిసెంబర్ 30:2022లో జరగనున్న ఉత్తరప్రదేశ్ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి ఈసీ సమీక్ష నిర్వహించింది. ఈ మేరకు యూపీలో పర్యటించి స్థానిక పరిస్థితులను పరిశీలిం చనున్నట్టు తెలిపింది. రాష్ట్ర, జిల్లా అండ్ డివిజనల్ అధికారులతో మాట్లాడి ఎన్నికల ఏర్పాట్లను పర్యవేక్షించనున్నట్టు ఎన్నికల సంఘం తెలిపింది.

"అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు మమ్మల్ని కలుసుకున్నారు. అన్ని ఆూఎఎఆ-19 ప్రోటోకాల్‌లను అనుసరించి సమయానికి ఎన్నికలు నిర్వహించాలని చెప్పారు. అన్ని ఓటింగ్ బూత్‌ల వద్ద ఎఎఖయిలను ఇన్‌స్టాల్ చేయాలి. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత ఉండేలా దాదాపు 1 లక్ష ఓటింగ్ బూత్‌లలో లైవ్ వెబ్‌కాస్టింగ్ సౌకర్యాలు అందుబాటులో ఉంటాయి. 2017 జఖ అసెంబ్లీ ఎన్నికలలో 61% ఓటింగ్ నమోదైంది. 2019 లోక్‌సభ ఎన్నికల్లో యూపీలో 59% ఓటింగ్ నమోదైంది. ప్రజల్లో రాజకీయ అవగాహన ఎక్కువగా ఉన్న రాష్ట్రంలో ఓటింగ్ శాతం ఎందుకు తక్కువగా ఉందనేది ఆందోళన కలిగించే అంశం". అని ఎన్నికల సంఘం అధికారులు తెలిపారు.

మెక్సికోలో కాల్పులు .. ఇద్దరు చిన్నారులు సహా 8 మంది మృతి

మెక్సికోసిటి, డిసెంబర్ 30:: మెక్సికోలో దారుణం చోటుచేసుకుంది. గ్వానాజుటావో రాష్ట్రం సిలావో గ్రామంలో ఇద్దరు గుర్తుతెలియని దుండగులు బైక్ మీద వచ్చి కాల్పులకు తెగబడ్డారు. ఈ కాల్పులలో ఎనిమిది మంది అమాయకులు మృతి చెందారు. దీంతో ఒక్కసారిగా ఆ ప్రాంతమంతా భయానకంగా మారిపోయింది. దీంతో ఆగ్రహించిన స్థానికులు.. ఆగంతకులను పట్టుకోని వారిపై దాడిచేశారు. దీంతో వారు కూడా మరణించారు. ఈ ఘటనలో ఇప్పటి వరకు ఇద్దరు దుండగులతో సహా, మరో 8 మంది మృతి చెందినట్లు అధికారులు తెలిపారు.

మృతుల్లో ఇద్దరు చిన్నారులు ఉన్నట్లు గుర్తించారు. వెంటనే స్థానికులు క్షతగాత్రులను దగ్గరలోని ఆసుపత్రులకు తరలించారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని భావిస్తున్నారు.

కాగా, ఈ దాడులు నిర్వహించిన వారు డ్రగ్స్ ముఠాకు చెందిన వారిగా భావిస్తున్నారు. శాంటా రోసాడి లిమా, జాలిస్కో న్యూజనరేషన్‌ల మధ్య పోరాటం కారణంగా గ్వానాజువాటో అత్యంత హింసాత్మక ప్రదేశంగా మారింది.

2006లో మెక్సికో మాదక ద్రవ్యాల అక్రమరవాణాపై నియంత్రణ విధించినప్పటి నుంచి ఈ దాడులు అధికమయ్యాయి. కొన్ని డ్రగ్స్ గ్యాంగ్‌లు ఆధిపత్యం కోసం పరస్పరం దాడులు చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. గత నవంబరులో జరిగిన దాడిలో 11 మంది అమాయకులు మృతి చెందిన విషయం తెలిసిందే. 2006 నుంచి ఇప్పటి వరకు దాదాపు మూడు లక్షల మంది అమాయకులు మృతి చెందినట్లు అధికారులు పేర్కొన్నారు.

ఒమిక్రాన్ సమూహ వ్యాప్తి మొదలైంది: ఢిల్లీ ఆరోగ్య మంత్రి

న్యూఢిల్లీ, డిసెంబర్ 30: ఎలాంటి ట్రావెల్ హిస్టరీ లేని వారికీ ఒమిక్రాన్ సోకుతోందని, దానర్థం ఒమిక్రాన్ సమూహ వ్యాప్తి (కమ్యూనిటీ స్ప్రెడ్) మొదలైపోయి నట్టేనని ఢిల్లీ మంత్రి సత్యేందర్ జైన్ చెప్పారు. ఒమిక్రాన్ క్రమంగా జనాల్లోకి వెళ్లిపోయి వ్యాప్తి మొదలైపోతోందని పేర్కొన్నారు. ఢిల్లీలో కొత్తగా నమోదైన కరోనా కేసుల్లో 46 శాతం ఒమిక్రాన్ కేసులేనని అన్నారు. తాజా జన్యు క్రమ విశ్లేషణలో ఈ విషయం బయటపడిందన్నారు.

కాగా, నిన్న ఒక్కరోజే ఢిల్లీలో 923 కరోనా కేసులు నమోదయ్యాయి. అందులో 238 ఒమిక్రాన్ కేసులున్నాయి. మే 30 నుంచి నమోదైన రోజువారీ కరోనా కేసుల్లో ఇదే అత్యధికం. అంతకుముందు రోజుతో పోలిస్తే కేసులు 86 శాతం అధికంగా నమోదయ్యాయి. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ఎల్లో అలర్ట్ ను ప్రకటించింది.

317జీవోపై స్టే ఇచ్చేందుకు హైకోర్టు నిరాకరణ

హైదరాబాద్, డిసెంబర్ 30: తెలంగాణలోని కొత్త జిల్లాలకు ఉద్యోగుల కేటాయింపునకు సంబంధించిన జీవో 317పై హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. జీవో 317పై స్టే ఇవ్వలేమని హైకోర్టు స్పష్టం చేసింది. ఇటీవల తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన జీవో 317ను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్ పై హైకోర్టు విచారణ చేపట్టింది.

371డిని పార్లమెంట్‌లో ఆమోదించకుండా బదిలీలు చేపట్టడం సరైంది కాదని పిటిషనర్ కోర్టుకు తెలిపారు. 317 జీవోపై స్టే ఇవ్వాలని పిటిషనర్ తరపు న్యాయవాది కోరారు. అయితే స్టే ఇవ్వడానికి హైకోర్టు చీఫ్ జస్టిస్ సతీష్ చంద్ర శర్మ నిరాకరించారు. ప్రతివాదుల వివరణ తీసుకున్న తర్వాత నిర్ణయం తీసుకుంటామని ధర్మాసనం తేల్చి చెప్పింది. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని సర్కారును ఆదేశించింది. తదుపరి విచారణను హైకోర్టు నాలుగు వారాలకు వాయిదా వేసింది.

నాలా సమస్యలకు శాశ్వత పరిష్కారంగా ఎస్ఎన్‌డీపీ : కేటీఆర్

హైదరాబాద్, డిసెంబర్ 30:శాశ్వతంగా నాలా సమస్యలు పరిష్కారం చేయాలని ఎన్ఎన్‌డీపీ చేపట్టామని.. 12 కిలోమీటర్లు హుస్సేన్ సాగర్ నుంచి వచ్చే వరద కాల్వ రిటైనింగ్ వాల్ కట్టాలని నిర్ణయం తీసుకున్నామని తెలంగాణ రాష్ట్ర ఐటీశాఖ మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. ఇవాళ ఫీవర్ హాస్పిటల్ వద్ద హుస్సేన్ సాగర్ సర్ ప్లస్ నాలా రిటైనింగ్ వాల్ కి మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేశారు. రూ.68 కోట్ల రూపాయలతో కవాడి గూడ బ్రిడ్జ్ నుంచి మూసీలో కలిసే వరకు నాలాకు రక్షణ గోడ నిర్మాణం చేపట్టారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. అక్టోబర్ నెలలో వర్షాలు పడిన సమయంలో హుస్సేన్ సాగర్ పొంగి నల్లకుంట, అంబర్ పేట ప్రజలు చాలా ఇబ్బంది పడ్డారన్నారు. అందువల్ల ప్రజలకు ఇబ్బందులు ఉండొద్దనే ఉద్దేశంతో శాశ్వత పరిష్కారం చేపట్టామన్నారు. మంచినీటి సమస్య, రోడ్ల సమస్య పరిష్కారం చేసుకుంటున్నామని.. నాళాల అభివృద్ధికి చర్యలు ప్రారంభించామని మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి తలసాని, ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేష్, ముఠా గోపాల్ పాల్గొన్నారు.

తెలంగాణలో ఒమిక్రాన్ వ్యాప్తి.. థర్డ్ వేవ్ కి సంకేతం!

హైదరాబాద్, డిసెంబర్ 30: తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల్లో కరోనా కేసులు పెరుగుతున్నాయని తెలంగాణ ప్రజారోగ్యశాఖ డైరెక్టర్ గడల శ్రీనివాసరావు తెలిపారు. ఈ రోజు ఆయన హైదరాబాద్‌లో మీడియా సమావేశం నిర్వహించి కరోనా కేసుల గురించి మాట్లాడారు. కరోనా కేసులు పెరిగిపోతున్నాయని, ఒమిక్రాన్ వేగంగా వ్యాప్తి చెందుతోందని, ఇది కరోనా థర్డ్ వేవ్‌ను సంకేతమని చెప్పారు. దాన్ని ఎదుర్కొనేందుకు సన్నద్ధంగా ఉన్నామని అన్నారు. నూతన సంవత్సర వేడుకల్లో జాగ్రత్తలు తీసుకోవాలని, కరోనా నిబంధనలు పాటించాని చెప్పారు. సంక్రాంతి తర్వాత థర్డ్‌వేవ్ వచ్చే అవకాశముందని తెలిపారు. ఇప్పటికే ప్రపంచ వ్యాప్తంగా 130 దేశాలకు ఒమిక్రాన్ వ్యాపించిందని ఆయన చెప్పారు. తెలంగాణలో ఆ కేసులు పెరిగాయని తెలిపారు.

డెల్టా వేరియంట్ కంటే 30 రెట్ల వేగంతో ఒమిక్రాన్ వ్యాప్తి ఉందని, అయితే కేసుల పెరుగుదలపై ప్రజలు అంతగా అప్రమత్తంగా ఉండాలి కానీ భయపడాల్సిన అవసరం లేదని తెలిపారు. దేశంలో తొలి దశ, రెండో దశలో కరోనా విజృంభణ సమయంలో నేర్చుకున్న పాఠాలతో ప్రభుత్వం, వైద్యారోగ్యశాఖ సిద్ధంగా ఉందని చెప్పారు. ప్రజలు మాస్క్ ధరించాలని, అందరూ వ్యాక్సిన్ తీసుకోవాలని ఆయన కోరారు. వాటి ద్వారానే ఒమిక్రాన్ నుంచి రక్షించుకోవచ్చని తెలిపారు. ఒమిక్రాన్ సోకిన వారిలో 90 శాతం మందికి వ్యాధి లక్షణాలు కనిపించడం లేదని ఆయన చెప్పారు. రాష్ట్రంలో, దేశంలో వచ్చే నాలుగు వారాలు అత్యంత కీలకమని తెలిపారు. గతంలో కరోనా రెండు దశల్లో వ్యాప్తి జరిగినప్పుడు కరోనాపై విజయం సాధించామని చెప్పుకొచ్చారు.

మూడో దశ వ్యాప్తి సూచనల నేపథ్యంలో రానున్న రోజుల్లో మరిన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు. వ్యాధి లక్షణాలు ఉన్నవారు జాగ్రత్తగా ఉండాలన్నారు. అయితే, భయపడకూడదని, వైరస్ కన్నా భయమే ప్రమాదకరమని ఆయన చెప్పారు. అయితే, ఈ థర్డ్ వేవ్ కరోనాకు ముగింపులాంటిదని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

పిల్లలు టీకాను తప్పనిసరిగా తీసుకోవాలి : అమిత్ షా

న్యూఢిల్లీ, డిసెంబర్ 30:జనవరి 3 నుంచి పిల్లలకు టీకా ప్రారంభమవుతున్నందున 15 నుంచి 18 ఏళ్ల వయసున్న పిల్లలు టీకాను తప్పనిసరిగా తీసుకోవాలని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా పిలుపునిచ్చారు. ఆయన మాట్లాడుతూ? ప్రజలు అలసత్వం వహిస్తూ నిబంధనలు పాటించకుంటే కొవిడ్ మహమ్మారిని నియంత్రించలేమన్నారు. వైరస్ రూపు మార్చుకుంటూ విజృంభిస్తున్నందున జిల్లా, రాష్ట్ర స్థాయిలో అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అందరూ కలసికట్టుగా పనిచేస్తే కొవిడ్ పోరులో విజయం సాధిస్తామన్నారు. అలాగే గడువు ముగిసినా రెండో డోసు తీసుకోని వారందరూ వెంటనే తీసుకోవాలని సూచించారు. అలాగే ప్రతి ఒక్కరూ మాస్కులు ధరించాలని, శానిటైజర్లు వాడాలన్నారు.

317 జీవోపై స్టేకు హైకోర్టు నిరాకరణ

హైదరాబాద్, డిసెంబర్ 30:తెలంగాణలోని కొత్త జిల్లాలకు ఉద్యోగుల కేటాయింపునకు సంబంధించిన జీవో 317పై హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. జీవో 317పై స్టే ఇవ్వలేమని హైకోర్టు స్పష్టం చేసింది. ఇటీవల తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన జీవో 317ను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్ పై హైకోర్టు విచారణ చేపట్టింది.

371డిని పార్లమెంట్‌లో ఆమోదించకుండా బదిలీలు చేపట్టడం సరైంది కాదని పిటిషనర్ కోర్టుకు తెలిపారు. 317 జీవోపై స్టే ఇవ్వాలని పిటిషనర్ తరపు న్యాయవాది కోరారు. అయితే స్టే ఇవ్వడానికి హైకోర్టు చీఫ్ జస్టిస్ సతీష్ చంద్ర శర్మ నిరాకరించారు. ప్రతివాదుల వివరణ తీసుకున్న తర్వాత నిర్ణయం తీసుకుంటామని ధర్మాసనం తేల్చి చెప్పింది. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని సర్కారును ఆదేశించింది. తదుపరి విచారణను హైకోర్టు నాలుగు వారాలకు వాయిదా వేసింది.

న్యూఇయర్ వేడుకలపై పోలీసుల ఆంక్షలు

హైదరాబాద్, డిసెంబర్ 30:నూతన సంవత్సర వేడుకల సందర్భంగా పోలీసులు ఆంక్షలు విధించారు. పబ్‌లు, హోటళ్ళు, క్లబ్‌లకు మార్గదర్శకాలను హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ నిన్న విడుదల చేశారు. నూతన సంవత్సర వేడుక పార్టీల్లో డీజేలకు అనుమతి లేదని ఆయన తెలిపారు. పబ్‌లు, రెస్టారెంట్లకు పక్కన ఉన్న స్థానికులను ఇబ్బందులకు గురిచేయవద్దని సూచించారు. స్థానికుల నుంచి ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. కొవిడ్ నేపథ్యంలో రెండు డోసులు తీసుకున్నవారికే వేడుకలకు అనుమతి ఉందని, నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఈవెంట్లకు పరిమితి మించి పాసులను జారీ చేయవద్దని, పార్టీల్లో డ్రగ్స్‌తో పట్టుబడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడితే తీవ్ర చర్యలు తప్పవన్నారు. ఈనెల 31వ తేదీ రాత్రి అకస్మికంగా డ్రంక్ అండ్ డ్రైవ్‌లు నిర్వహిస్తామని, మాస్క్ లేకుండా కనిపిస్తే రూ.1000 జరిమానాల విధిస్తామన్నారు.

వేడుకల్లో భౌతికదూరం పాటించేలా నిర్వాహకులు చర్యలు తీసుకోవాలని, వేడుకలకు రెండు రోజుల ముందే అనుమతి తీసుకోవాలని ఆయన ఆదేశించారు. వేడుకల్లో నిధులు నిర్వహించే సిబ్బందికి 48 గంటల ముందు తప్పనిసరిగా కొవిడ్ పరీక్షలు చేయాలన్నారు. మద్యం సేవించి వాహనం నడిపేతే ఆరు నెలలు జైలు శిక్షతో పాటు రూ.10 వేల జరిమానా విధిస్తామని ఆయన హెచ్చరించారు. మహిళలపై వేధింపుల కట్టడికి షీ టీంలతో ప్రత్యేక నిఘా పెడతామన్నారు.

గొల్ల,కుర్మలు అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి వుంది:తలసాని

హైదరాబాద్, డిసెంబర్ 30: గొల్ల, కుర్మలు ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందాలనే దృఢ సంకల్పంతో ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాలతో 75 శాతం సబ్సిడీపై గొర్రెల పంపిణీ చేపట్టడం జరిగిందని పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, చెప్పారు. గతంలో ఉన్న పాలకులు గొల్ల, కురువలను కేవలం ఓటు బ్యాంకు గానే చూశారని అన్నారు. రాష్ట్రంలో గొర్రెల పెంపకంపై ఆధారపడి జీవిస్తున్న వారికి సేవ చేసే అవకాశాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్ బాలరాజ్ యాదవ్ కు కల్పించారని చెప్పారు. తెలంగాణ రాష్ట్ర షీప్స్ అండ్ గోట్స్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గా డాక్టర్ దూదిమెట్ల బాలరాజ్ యాదవ్ గురువారం బాధ్యతలు స్వీకరించారు.

ఈ కార్యక్రమంలో మంత్రి తలసాని మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఏ ప్రభుత్వం చేయని విధంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం యాదవుల సంక్షేమం, అభివృద్ధి కోసం కృషి చేస్తుందని తెలిపారు. రాష్ట్ర సాధన కోసం ఉద్యమం లో భాగస్వాములైన ఉద్యమకారులకు ప్రభుత్వం సముచిత స్థానం కల్పించిందని చెప్పారు. రాష్ట్రం అన్ని రంగాలలో అభివృద్ధి దిశగా ముందుకు వెళ్తుండగా ప్రతిపక్ష పార్టీలకు చెందిన నేతలు కొందరు ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ కృషి తో యాదాద్రి దేవాలయం ఒక అద్భుత కళాఖండంగా రూపుదిద్దుకున్నదని తెలిపారు. యాదవుల కులదైవం కొమురెల్లి మల్లన్న ఆలయం కూడా గతంలో కంటే ఎంతో అభివృద్ధి చెందిందని అన్నారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు బడుగుల లింగయ్య యాదవ్,ఎమ్మెల్యేలు అంజయ్య యాదవ్, జైపాల్ యాదవ్, పశుసంవర్ధక శాఖ కార్యదర్శి అనిత రాజేంద్ర, గొర్రెలు, మేకల అభివృద్ధి ఫెడరేషన్ ఎండి రాంచందర్, మత్స్య శాఖ కమిషనర్ లచ్చిరాం భూక్యా, జేవరేజెస్, వేర్ హౌస్ కార్పొరేషన్ ల చైర్మన్ లు గజ్జెల నగేష్, సాయిచంద్, నల్లగొండ జిల్లా డీసీసీబి చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి, మాజీ ఎంఎల్సీ పూల రవీందర్, వివిధ జిల్లాల నుండి వచ్చిన గొర్రెల పెంపకం దారులు, యాదవ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

జేమ్స్ వెబ్ స్పేస్ టెలిస్కోప్ అంతరిక్ష రహస్యాల గుట్టు విప్పగలదా?!

('జేమ్స్ వెబ్ స్పేస్ చెలిస్కోప్'ను విజయవంతంగా ప్రయోగించిన సందర్భంగా)

అంతరిక్షం ఓ అంతుచిక్కని మహాద్భుతం. ఖగోళ అన్వేషణకు మానవ ప్రయత్న అనంత శోధన. అంతరిక్ష రహస్యాల పుట్టను తవ్వి, విశ్వ ఆవిర్భావ రహస్యాల గుట్టువిప్పి, సరికొత్త చరిత్రను లిఖించడానికి 25 డిసెంబర్ 2021న నాసా ప్రయోగించిన అత్యంత శక్తివంతమైన 'జేమ్స్ వెబ్ స్పేస్ టెలిస్కోప్ (జెడబ్ల్యూయస్‌టి)' ప్రయోగ ప్రయత్నం విజయవంతమైంది. అంతరిక్ష మర్మాల చిక్కుముళ్లు విప్పే కృషిలో భాగంగా 29 దేశాల శాస్త్రవేత్తలు, 25 ఏండ్లుగా శ్రమించి, 10 బిలియన్ డాలర్లు వెచ్చించి రూపొందించిన జెడబ్ల్యూయస్‌టిని ఫ్రెంచ్ గయానా కౌరూ ఏయుర్ స్పేస్ నుంచి ఏరియన్ రాకెట్టు దిగ్విజయంగా రోదసిలోకి దూసుకెళ్లి, మానవాళిలో ఉత్సుకతను రేకెత్తిస్తున్నది. గతంతో అపోలో మూన్ లాండింగ్ ప్రయోగ నిర్మాణంలో ప్రముఖ పాత్ర వహించిన 'జేమ్స్ వెబ్' పేరును ఈ టెలిస్కోప్‌కు తీసుకున్నారు. జేమ్స్ వెబ్ స్పేస్ టెలిస్కోప్ నిర్మాణంలో అమెరికన్ నాసా, యూరోపియన్, కెనెడియన్ స్పేస్ ఏజన్సీల ఇంజనీర్లు, వేల ప్రపంచ శాస్త్రవేత్తలు గత 30 ఏళ్ల కృషిలో భాగంగా 100 రెట్లు శక్తివంతమైన టెలిస్కోప్‌ను విజయవంతంగా రూపొందించారు. జేమ్స్ వెబ్ టెలిస్కోప్ బరువు 6,200 కేజీలు, టెన్నీస్ మైదాన సైజ్, 6.5 మీటర్ల బంగారు పూత కలిగిన మిర్రర్ సైజ్, జీవితకాలం 10 ఏండ్లతో మైనస్ 230 డిగ్రీల సెల్సియస్ ఆపరేటింగ్ ఉష్ణోగ్రతలను కలిగి ఉండడం దీని ప్రత్యేకతగా చెప్పవచ్చు. అంతరిక్షంలో పాలపుంతను దాటుతూ భూమి నుంచి 1 మిలియన్ మైళ్ల దూరంలో కక్షలో చేరడానికి కనీసం ఒక మాసం పడుతుందని వివరిస్తున్నారు.

1990లో ప్రయోగించిన హబుల్ టెలిస్కోప్:

1990లో ప్రయోగించిన 'హబుల్' టెలిస్కోప్ జీవితకాలం 31 ఏండ్లు ఉన్నప్పటికీ మిర్రర్ సైజ్ 2.4 మీటర్లు, బరువు 12,200 కేజీలు, ఆపరేటిగ్ టెంపరేచర్ 20 డిగ్రీల సెల్సియస్ మాత్రమే ఉండడంతో అన్వేషణ ఫలితాలు అంతగా ఆశించలేమని తెలియజేస్తున్నారు. 1990లో ప్రయోగించిన హబుల్ టెలిస్కోప్‌తో పోల్చితే 100 రెట్లు క్రియాశీలత కలిగిన జేమ్స్ వెబ్ టెలిస్కోప్‌తో అంతరిక్ష శోధనల సత్ఫలితాలు ఆశించవచ్చు.

జేమ్స్ వెబ్ స్పేస్ టెలిస్కోప్ లక్ష్యాలు:

13.5 బిలియన్ల ఏళ్ల క్రితం 'బిగ్ బ్యాంగ్ విస్ఫోటనం' అనంతరం ఏర్పడిన విశ్వం, గెలాక్సీలు, నక్షత్రాలు, గ్రహాల అంతరిక్షాన్ని శోధించి రహస్యాల గుట్టల్ని తొవ్వి వాస్తవాలను వెలుగులోకి తేవడానికి చేస్తున్న మహా విశ్వ అన్వేషణ ఫలితమే జెడబ్ల్యూయస్‌టి ప్రయోగం అని అవగాహన చేసుకోవాలి. రోదసిలోకి చేరిన జేమ్స్ వెబ్ స్పేస్ టెలిస్కోప్ ద్వారా నక్షత్రాలు, గెలాక్సీలు, గ్రహ మండలాలు, గ్రహాలను శోధించడం జరుగుతుంది. వీటితో పాటు ఆయా గ్రహాలపై ఇతర జీవుల ఉనికి, మానవ ఆవాసానికి అవకాశాలను అంచనా వేయడం జరుగుతుందని తెలుస్తున్నది. అద్భుత అంతరిక్ష అన్వేషణలు జరగాలంటే, అత్యంత నిష్టతో అత్యాధునిక పరిజ్ఞాన వినియోగంతో జేమ్స్ వెబ్ టెలిస్కోప్ లాంటి అత్యంత పెద్దదైన, శక్తివంతమైన టెలిస్కోప్ ప్రయోగించాల్సిందే అని శాస్త్రవేత్తలు ఆత్మవిశ్వాసంతో వివరిస్తున్నారు. అనంత అద్భుతాల నెలవైన అంతరిక్ష రహస్యాల శోధనలో జేమ్స్ వెబ్ టెలిస్కోప్ సఫలం కావాలని ప్రపంచ మానవాళి ఆశిస్తున్నది.

- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

జిల్లాలో ఓటరు నమోదుకై స్పీప్ చేపట్టిన కార్యక్రమాలపై ప్రశంశ..!

-ఎలక్టరోల్ పరిశీలకులు శైలజ రామయ్యర్

మెదక్ , డిసెంబర్ 30 (నేటినిజం ప్రతినిధి) జిల్లాలో ఓటరు నమోదుకై స్పీప్ చేపట్టిన కార్యక్రమాలు బాగున్నాయని ఎలక్టరోల్ పరిశీలకులు శైలజ రామయ్యర్ ప్రశంసించారు. 5 జనవరి 2022 న ప్రకటించు ఓటర్ల తుది జాబితా సందర్భంగా ఓటర్ల నమోదు, సవరణలు, తొలగింపుల ప్రక్రియ పై గురువారం నరసాపూర్ అటవీ అతిథి గృహంలో అదనపు కలెక్టర్ రమేష్, ఆర్.డి.ఓ. సాయిరాం, తహశీల్దార్ తబిత తో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా ఓటరు నమోదు, తొలగింపుకు సంబంధించిన ఫైళ్లను సూపర్ చెక్ చేసి సంతృప్తి వ్యక్తం చేస్తూ వారు ఎదుర్కొన్న ఇబ్బందులు, సమస్యలు, , అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో ఎక్కువ మంది యువత ఆన్ లైన్ ద్వారా ఓటరు నమోదుకు దరఖాస్తు చేసుకోవడం ముదాహమని, ఇందుకోసం కళాశాల స్థాయిలో క్యాంపస్ అంబాసిడర్లకు ఓటర్ హెల్ప్లైన్ పై అవగాహన కలిగించి ఆ యాప్ ను డౌన్ లోడ్ చేసుకోవడంతో పాటు నమోదు ప్రక్రియ చేపట్టడం సంతోషకరమని అన్నారు. మెదక్, నరసాపూర్ నియోజక బూతు స్థాయి అధికారులు గరుడ యాప్ పై పూర్తి అవగాహన కలిగి వంద శాతం వివరాలు నమోదు చేయడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లాలో ఓటర్ల లింగ నిష్పత్తి 1053 మంది కాగా, ఈ.పి నిష్పత్తి 673 గా ఉన్నారని అన్నారు. జిల్లాలో వందశాతం అభ్యంతరాలు, క్లెయిమ్స్ పరిష్కరించడం, గరుడ యాప్ ను వంద శాతం ఉపయోగించడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ లాజికల్ ఎర్రర్స్ , డెమోగ్రాఫికల్ ఎర్రర్స్ లేకుండా చూడాలని సూచించారు. ఓటర్ల జాబితా పకడ్బందీగా రూపొందించి జనవరి 5, 2022 న అన్ని పోలింగ్ బూత్ లలో అట్టి జాబితా ప్రదర్శించాలని సూచించారు.

ఓటరు నమోదులో పుట్టిన తేదీకి ప్రాదిపదిక 10 వ తరగతి మెమో లేదా నిరాక్షరాస్యులకు ఏదేని జనన ధ్రువపత్రం ప్రామాణికంగా తీసుకోవాలని శైలజా రామయ్యర్ తెలిపారు. అదేవిధంగా జాబితాలో పేర్లు తొలగించేటప్పుడు క్షేత్ర స్థాయిలో పర్యటించి సూపర్ చెక్ చేసి ఆ కుటుంబ సభ్యుల నుండి వివరాలు సేకరించి సంతకాలు తీసుకోవాలని, మరణించిన వారి విషయంలో డెత్ సర్టిఫికెట్ తీసుకోవాలని, సుమోటాగా పేర్లు తొలగించేటప్పుడు సమగ్ర వివరాలు సేకరించి ఓటరు జాబితాలో తొలగింపుకు కారణాలు పేర్కొనాలని, ఎవరి, ఎప్పుడు, ఎక్కడ సంప్రదించారో వివరాలు స్పష్టంగా నమోదు చేయాలని సూచించారు. ప్రధానంగా బ్లాక్ స్థాయి అధికారులు ఓటరు జాబితాలో ప్రజాప్రతినిధులు, ప్రముఖుల పేర్లు సరిగ్గా ఉన్నాయా అని పరిశీలించుకోవాలని, ఎన్నికల సమయంలో పేర్లు లేకపోతె ఇబ్బందులు పడవలసి వస్తుందని సూచించారు. బల్లు గా ఓటరు నమోదు లేదా తొలగింపుకు దరఖాస్తులు వస్తే క్షేత్ర స్థాయిలో ఎలక్ట్రారోల్ అధికారి పరిశీలించాలని సూచించారు. పేరు,వయస్సు, చిరునామా మార్పు వంటి అంశాలలో స్పష్టమైన ధ్రువపత్రాలుంటేనే ఓటరు జాబితాలో మార్పులు,చేర్పులు చేయాలని సూచించారు. ఫోటో లు సరిగ్గా లేకపోతె మళ్ళీ ఓటరు ఫోటో తీసుకొని అప్ లోడ్ చేయాలని అన్నారు. ఓటరు నమోదు కై ఆన్ లైన్ లో వస్తున్న దరఖాస్తులతో పాటు మాన్యువల్ గా వస్తున్న దరఖాస్తులను కూడా ఆన్ లైన్ లో నమోదు చేయాలన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కుకు ఎంతో విలువ ఉందని, 18 సంవత్సరాలు నిండిన ప్రతి యువత ఓటరుగా పేరు నమోదు చేసుకోవాలని కేంద్ర ఎన్నికల కమిషన్ ఎప్పటికప్పుడు తాజా సమాచారాన్ని తమ వెబ్ సైట్ లో పెడుతుందని, ఆన్ లైన్ ద్వారా వివరాలు తెలుసుకోవచ్చని అన్నారు. భవిష్యత్తు అంతా డిజిటల్ మాయం కానున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరికి ఓటర్ యాప్, గరుడ యాప్ పట్ల అవగాహన కలిగి ఉండాలని అన్నారు.అదనపు కలెక్టర్ రమేష్ మాట్లాడుతూ జిల్లాలో 4,13,517 మంది ఓటర్లున్నారని అన్నారు. 1 నవంబర్ 2021 న డ్రాఫ్ట్ పబ్లికేషన్ నాటికీ 2,917 మంది కొత్తగా ఓటరు గా నమోదు చేలు వంద శాతం గరుడ యాప్ ద్వారా వివరాలు నమోదు చేస్తున్నారని తెలిపారు వంద శాతం ఎపిక్ కార్డుల నమోదు చేశామని, ఫోటో అప్ లోడింగ్ లో ఎలాంటి సమస్యలు రాలేవని, ఇటీవల ఈ.వి.ఎం. గోదాముల ప్రారంభోత్సవం సందర్భంగా వచ్చిన ప్రధాన ఎన్నికల అధికారి శశాంక్ గోయల్ కూడా జిల్లాలో ఓటర్ల నమోదు వివరాలు అడిగి తెలుసుకొని సంతోషం వ్యక్తం చేశారని అన్నారు. కాగా గరుడ యాప్ లో సాంకేతిక సమస్యలు వస్తున్నాయని పరిశీలకులకు తెలిపారు.

ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో గుళికల రూపంలో ఉన్న ఒక కిలో కొకైన్

న్యూఢిల్లీ, డిసెంబర్ 30: న్యూఢిల్లీ అంతర్జాతీయ విమానాశ్రయంలో కస్టమ్స్ అధికారులు సరికొత్త రీతిలో సాగుతున్న మాదకద్రవ్యాల రవాణాను గుర్తించి ఛేదించారు. అత్యంత శ్రద్ధతో దేగ కళ్ళతో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు కొకైన్ అక్రమ రవాణాను అరికట్టారు. గుళికల రూపంలో కొకైన్ ను మింగి దానికి అక్రమంగా తరలించడానికి జరిగిన ప్రయత్నాలను కస్టమ్స్ అధికారులు భగ్నం చేశారు . దీనికి సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి.

కొన్ని రోజుల కిందట ఉగాండా కి చెందిన ఒక ప్రయాణికురాలు ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్నారు. టెర్మినల్ -3 వద్ద ప్రయాణికురాలి అధికారులు గుర్తించారు. ప్రయాణికురాలి కదలికలు, ప్రవర్తన అసహజంగా ఉండటంతో అధికారులు ఆమెను ఆపి ప్రశ్నించారు. మానవతా దృక్పథంతో ఆమెకు సహాయం అందించాలని అధికారులు భావించారు. అధికారులు నుంచి సహాయం తీసుకునేందుకు నిరాకరించిన ప్రయాణికురాలు వారితో మాట్లాడేందుకు కూడా విముఖత వ్యక్తం చేశారు. అదే సమయంలో ఆమె ఇబ్బంది పడుతున్నట్లు అధికారులు గుర్తించారు.

ప్రయాణికురాలి అసహజ ప్రవర్తన అధికారులకు అనుమానం కలిగించింది. దీనితో అధికారులు సదరు ప్రయాణికురాలిని జాగ్రత్తగా గమనించడం ప్రారంభించారు. గ్రీన్ గ్రీన్ ఛానల్‌ను దాటి అంతర్జాతీయ నిష్క్రమణ ద్వారం వద్దకు వచ్చిన ఆమెను కస్టమ్స్ అధికారులు అడ్డుకున్నారు. తరచి తరచి ప్రశ్నించడంతో ఆమె 91 మత్తుపదార్థాల క్యాప్సూల్స్‌ను మింగినట్లు వెల్లడించింది. ఆరోగ్యపరమైన అత్యవసర పరిస్థితి కావడంతో అధికారులు ప్రయాణికురాలని ఆర్ఎంఎల్ ఆసుపత్రిలో చేర్చారు. ఎక్స్ రే లో సదరు ప్రయాణికురాలి కడుపులో 91 గులికెలు ఉన్నట్టు పెద్దపేగు కింద, పై భాగాలు గులికెలతో నిండిపోయి వున్నాయి. నిపుణులైన వైద్యుల పర్యవేక్షణలో వాటిని వెలికి తీశారు. మొత్తం ఆమె కడుపులో నుంచి 91 గుళికలు బయట పడ్డాయి. ఈ ప్రక్రియ పూర్తి కావడానికి అనేక రోజులు పట్టింది. ఈ సమయంలో కస్టమ్స్ అధికారులు గట్టి నిఘా ఉంచారు. ఈ గులికెలను పౌడర్ రూపంలో ఉన్న కొకైన్తో నింపారు. పట్టుబడిన కొకైన్ బరువు 992 గ్రాముల వరకు ఉంది. కోలుకున్న ప్రయాణికురాలిని కస్టమ్స్ అధికారులకు ఆస్పత్రి అధికారులు అప్పగించారు. ఎన్ డి పి ఎస్ చట్టం,1985 లోని సెక్షన్ 43(బి) కింద కేసు నమోదు చేసిన అధికారులు 29.12.2031 న ఆ మహిళను అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు. కేసు విచారణ కొనసాగుతోంది.

చెరువులో విషప్రయోగం.. చేప పిల్లలు మృతి

అమరావతి, డిసెంబర్ 30:గ్రామంలోని కోమటి వారి కుంట చెరువులో విషప్రయోగం చేయడంతో చేపపిల్లలు మృతి చెందాయి. నెల్లూరులోని కొల్లపూడి గిరిజన కాలనీకి చెందిన ఇరగా వెంకటేశ్వర్లు, ఉదయగిరి మండలం బండగాని పల్లికి చెందిన ఇర్లా వెంగయ్య అనే వ్యక్తులు ఈ చెరువును జి.అయ్యవారిపల్లి గ్రామ పంచాయతీ ద్వారా లీజుకు తీసుకుని లక్ష చేపపిల్లలను 25 రోజుల క్రితం వదిలారు. వాటికి పోషకాహారం వేసేందుకు బుధవారం లీజు దారులు చెరువు వద్దకు వెళ్లగా చెరువులోని చేపలు మొత్తం చనిపోయాయి.

దీంతో చనిపోయిన చేప పిల్లలను ల్యాబ్ లో పరీక్ష చేయించగా విష ప్రయోగంతో చనిపోయినట్లు నిర్ధారణ అయింది. బండగాని పల్లి పంచాయతీకి చెందిన ఓ వ్యక్తి తమను పది రోజుల క్రితం బెదిరించి డబ్బులు డిమాండ్ చేశాడని, తాము అతనికి డబ్బులు ఇవ్వడానికి నిరాకరించగా అతనే చెరువులో విష ప్రయోగం చేసి ఉంటాడని బాధితులు ఉదయగిరి పోలీస్ స్టేషన్ లో గురువారం ఉదయం ఫిర్యాదు చేశారు. ఈ విష ప్రయోగం కారణంగా తమకు దాదాపు రూ. 8 లక్షల 60 వేలు నష్టం వాటిల్లిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ గిరిబాబు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఈశాన్య ప్రాంత అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో మహిళా స్వయం సహాయక బృంద విజయగాథ

న్యూఢిల్లీ, డిసెంబర్ 30:డెన్‌లాంగ్ ఎస్‌హెచ్‌జి 2014లో హెచ్ మఖాయ్ గ్రామంలో'సాహెయి ఫౌండేషన్ ద్వారా నార్త్ ఈస్టర్న్ రీజియన్ కమ్యూనిటీ రిసోర్స్ మేనేజ్‌మెంట్ ప్రాజెక్ట్ (ఎన్ఈఆర్ఎఓఆర్ఎంపీ) సహాయంతో ఏర్పడింది. డెన్‌లాంగ్ ఎస్‌హెచ్‌జిలో అధ్యక్షులు, కార్యదర్శి మరియు కోశాధికారితో సహా 15 మంది సభ్యులు ఉన్నారు. ఎస్‌హెచ్‌జి సమావేశం నెలలో రెండుసార్లు నిర్వహిస్తారు. ఇక్కడ ప్రతి సభ్యురాలి సహకారం మొత్తం రూ.40/- మాత్రమే మరియు ప్రతి నెలలో వారు రూ.80 విరాళంగా అందిస్తారు. ఎస్‌హెచ్‌జి ప్రారంభమైనప్పటి నుండి ఎటువంటి అడ్డంకులు లేకుండా అభివృద్ధి చెందుతోంది. ఈ స్వయం సహాయక బృందం ద్వారా ఆదాయం పొందడమే కాకుండా పరిశుభ్రత, వైద్య సదుపాయాలు వంటి అనేక కార్యక్రమాలతో పాటు గ్రామంలో చిన్నపాటి చెత్తకుండీలను నిర్వహిస్తున్నారు.

మష్రూమ్ కల్చర్, ఆకు కూరలు పండించడం, నేతపని మరియు పౌల్ట్రీ వంటి సమూహ ఆదాయాన్ని సృష్టించే కొన్ని కార్యకలాపాలు మునుపటి సంవత్సరాల్లో జరిగాయి. సమావేశంలో తీర్మానం ఆమోదించబడిన తర్వాత ఈ కార్యకలాపాలను ఎస్‌హెచ్‌జి స్వచ్ఛందంగా ప్రారంభించింది. ఆదాయాన్ని ఉత్పత్తి చేసే కార్యాచరణ లాభం వారి గ్రూప్ ఖాతాలోకి వెళుతుంది. అంటే సమూహ కార్యకలాపాలు వారి సమూహం ద్వారా వ్యక్తులకు ప్రయోజనం చేకూర్చడానికి ఉద్దేశించబడ్డాయి. ఈ పొదుపులన్నీ తమ కోసమేనని వారికి స్పష్టంగా అర్థమైంది.

డెన్‌లాంగ్ ఎస్‌హెచ్‌జి 2014లో జీరో బ్యాలెన్స్‌తో ఏర్పడింది. అయితే అవి పురోగమిస్తున్నప్పుడు 2021లో వారి కార్పస్ ఫండ్‌గా రూ.2.50 లక్షల కంటే ఎక్కువ మాత్రమే ఉన్నాయి. ఈ మొత్తాలను 2 శాతం వడ్డీ రేటుతో సభ్యుల మధ్య రివాల్వింగ్ ఫండ్‌గా ఉపయోగించారు. రివాల్వింగ్ ఫండ్ ఆర్థిక పురోభివృద్ధి, చిన్న/మధ్యతరహా వ్యాపార సంస్థలను తెరవడం మరియు అత్యవసర సమయాల్లో భద్రతగా ఉపయోగపడుతుంది.

డెన్‌లాంగ్ ఎస్‌హెచ్‌జి సభ్యులు ఫీడ్ బ్లాక్ మెషీన్‌ను నిర్వహిస్తున్నారు

2015లో ఎస్‌హెచ్‌జినుండి రుణం తీసుకున్న గ్రూప్ సభ్యురాలు శ్రీమతి నెంగ్నీవా.. ఆ రూ. 4000/- చిన్నపాటి మొత్తాన్ని చిన్న పౌల్ట్రీ వ్యాపారం ప్రారంభించడానికి ఉపయోగించారు. కుటుంబాన్ని పోషించడానికి ఆమె భర్తకు శాశ్వత పని లేదు కానీ ఇప్పుడు వారిద్దరూ కలిసి పని చేసి విజయం సాధించారు. వారు తమ వ్యాపారాన్ని కూడా విస్తరించారు మరియు మునుపటి కంటే ఆర్థికంగా మరింత స్వతంత్రంగా మారారు. ఆ లాభాలతో ఆమె కుటుంబ అవసరాలను నిర్వహిస్తుంది మరియు పందుల పెంపకం ప్రారంభించింది. మరియు ఇప్పుడు ఆమె వద్ద ఉన్న 4 పందులను మంచి ధరకు అమ్మవచ్చు.

30 సంవత్సరాల శ్రీమతి లామ్నొకిమ్ ఎస్‌హెచ్‌జి సభ్యురాలు. 2016లో ఆమె బిడ్డ తీవ్ర అనారోగ్యానికి గురైంది. తన బిడ్డకు చికిత్స చేయడానికి ఆమె వద్ద డబ్బు లేదు కాబట్టి ఆమె రూ. 20,000/-ఎస్‌హెచ్‌జి నుండి తీసుకునిఆమె బిడ్డ చికిత్స కోసం ఆ డబ్బును ఉపయోగించింది. చికిత్స అందిన కొద్దిరోజులకు ఆ బాలుడు తిరిగి ఆరోగ్యవంతుడయ్యాడు. 3 నెలల తర్వాత ఆమె ఎస్‌హెచ్‌జికి డబ్బు తిరిగి చెల్లిస్తోంది.

శ్రీమతి నెమ్‌ఖోకిమ్ ఎస్‌హెచ్‌జి సభ్యురాలు.ఆమె భర్త వివిధ నిర్మాణ స్థలంలో కూలీ పనుల్లో నిమగ్నమై ఉన్నారు. కానీ మాన్యువల్ లేబర్ పని ఆమె కుటుంబానికి ఎటువంటి సామాజిక భద్రతను అందించలేదు. 2015 సంవత్సరంలో ఆమె ఎస్‌హెచ్‌జి నుండి రుణం తీసుకుని నేతకు సంబంధించిన ముడిసరుకులను కొనుగోలు చేయడానికి పెట్టుబడి పెట్టింది. నేత పని లాభదాయకంగా మారింది. అంతేకాకుండా ఆమె మళ్లీ అప్పు తీసుకుని పాల వ్యాపారంలోకి దిగింది. రెండేళ్ల వ్యవధిలోనే ఆమె తన వ్యాపారాన్ని విస్తరించుకోగలిగింది మరియు పశువులు వారికి విలువైన ఆస్తిగా మారాయి. ఆమె భర్త కూడా వ్యాపారంలో పాలుపంచుకుంటున్నారు.

ఆమె మరింత రుణం తీసుకుంది. ఆ మొత్తంతో వారు అల్లం తోటను ప్రారంభించారు. సీజన్ ముగిసే సమయానికి వారు పండించిన పంటను మంచి లాభాలకు విక్రయించారు. స్వయం సహాయక సంఘాలు అందించే రుణం ద్వారా మరింత ఆర్థిక స్వాతంత్ర్యం పొందేందుకు ఇది వారికి వీలు కల్పించింది.ఎస్‌హెచ్‌జి వారి రోజువారీ ఆదాయ ఆధారిత కార్యాచరణను ప్రోత్సహించడానికి కష్టమర్లకు మద్దతు ఇచ్చే విలువైన బ్యాంకుగా పనిచేస్తుంది. వ్యక్తిగత స్థాయిలో సభ్యులు ఎటువంటి సంకోచం లేకుండా డబ్బును ఉపయోగించారు మరియు వారికి ప్రయోజనం చేకూర్చే వెంచర్లను ప్రారంభించారు. పైగా, 2 శాతం తక్కువ వడ్డీతో వారు రుణాన్ని తిరిగి చెల్లించవచ్చు. డబ్బు పంపిణీ, కేటాయింపు, వడ్డీ, తిరిగి చెల్లింపు మరియు పంపిణీలో నియమాలు మరియు నియంత్రణలు సరిగ్గా అనుసరించబడ్డాయి.ఆర్థిక అవసరాలు మరియు ఆర్థిక మద్దతుతో పాటు ఎస్‌హెచ్‌జి వారి సమస్యలను పంచుకోవడం మరియు అవసరమైన సమయాల్లో ఒకరికొకరు సహాయం చేయడం ద్వారా సభ్యుల మధ్య మరింత దృఢమైన సామాజిక బంధాన్ని అందిస్తుంది. చర్చి, విలేజ్ అథారిటీ, ఎన్ఎఆర్ఎం-జి వంటి ఇప్పటికే ఉన్న సంస్థలకు మద్దతు ఇవ్వడంలో ఎస్‌హెచ్‌జి గ్రామానికి ఆస్తిగా మారుతుంది. ఎస్‌హెచ్‌జి సభ్యురాలు, వారి భర్తలు సమావేశాలు మరియు కార్యకలాపాలలో ఎటువంటి ఫిర్యాదు చేయనందున వారి స్థితి మరింత స్వతంత్రంగా ఉందని తెలిపారు. వారు పనిలో నిమగ్నమై ఉన్నందున బదులుగా ఇంటి పనిలో మాకు మద్దతు ఇస్తారని తెలిపారు.

భారత ఆవిష్కరణలు, అంకుర సంస్థల పురోభివృద్ధికి ఉన్నత విద్యా సంస్థలు సహకరించాలి - డాక్టర్ సుభాష్ సర్కార్

న్యూఢిల్లీ, డిసెంబర్ 30:ఇన్నోవేషన్ అచీవ్‌మెంట్స్ (ఏఆర్ఐఐఏ) 2021లో అటల్ సంస్థల ర్యాంకులను ఈ రోజు విద్యా శాఖ సహాయ మంత్రి డాక్టర్ సుభాష్ సర్కార్ విడుదల చేశారు. వర్చువల్ విధానంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఏఐసీటీఈ చైర్మన్ ప్రొఫెసర్ అనిల్ సహస్రబుద్ధే, అదనపు కార్యదర్శి (సాంకేతిక) శ్రీ రాకేష్ రంజన్, విద్యా మంత్రిత్వ శాఖ ఇన్నోవేషన్ సెల్ అధిపతి డాక్టర్ అభయ్ జేరె, విద్యా మంత్రిత్వ శాఖ ఇన్నోవేషన్ సెల్ ఇన్నోవేషన్ డైరెక్టర్ డాక్టర్ మోహిత్ గంభీర్ కూడా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మాట్లాడిన డాక్టర్ సర్కార్ ఏఆర్ఐఐఏ ర్యాంకింగ్ లు విద్యా సంస్థల పనితీరును మరింత మెరుగుపరుస్తామని అన్నారు. ర్యాంకులను మెరుగు పరుచుకోవాలన్న లక్ష్యంతో విద్యాసంస్థలు పరిశోధన, వినూత్న ఆవిష్కరణల అంశాలకు ప్రాధాన్యత ఇచ్చి ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్రోత్సహించే విధంగా తమ విధివిధానాల్లో మార్పులు చేసుకోవడానికి ప్రాధాన్యత ఇస్తాయని మంత్రి అన్నారు. 2025 నాటికి 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థను సాధించడానికి వినూత్న ఆవిష్కరణలు తోడ్పడతాయని ఆయన పేర్కొన్నారు. సంఖ్యకి కాకుండా సంస్థలు నాణ్యతకు ప్రాధాన్యత ఇచ్చి సంస్థలు పరిశోధనలను ప్రోత్సహించాలని ఆయన సూచించారు. దీనివల్ల అసలైన ఆత్మ నిర్భర్ భారత్ సాధన సాధ్యమవుతుందని అన్నారు.

ఇటీవల కాశీలో పర్యటించిన ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ స్వచ్ఛ భారత్, ఆత్మనిర్భర్ భారత్ తో పాటు వినూత్న అంశాల ఆవిష్కరణకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించిన అంశాన్ని మంత్రి ఈ సందర్భంగా గుర్తు చేశారు.

ఈ మూడు అంశాలు సాకారం కావడానికి వినూత్న అంశాల ఆవిష్కరణలు దోహదపడతాయని అన్నారు. విద్యా సంస్థల్లో ఔత్సహిక పారిశ్రామిక వేత్తలను తీర్చి దిద్దేందుకు ప్రణాళిక అమలు జరగాలని అన్నారు. ఈ అంశంలో ఏఆర్ఐఐఏ ర్యాంకులు దోహదపడతాయని డాక్టర్ సర్కార్ అన్నారు.

ఆవిష్కరణలు, అంకుర సంస్థల రంగంలో భారత్ సుస్థిర అభివృద్ధి ని సాధిస్తున్నదని డాక్టర్ సర్కార్ అన్నారు. ప్రపంచంలో అతి పెద్ద ఉన్నత విద్యా వ్యవస్థ మనదేశంలో పని చేస్తున్నదని అన్నారు.ఆవిష్కరణలు, అంకుర సంస్థల రంగ అభివృద్ధికి ఉన్నత విద్యా సంస్థలు మరింత సహకారం అందించాలని ఆయన సూచించారు.

ఆవిష్కరణలు, అంకుర సంస్థలపై ఉన్నత విద్యా సంస్థలు పారిశ్రామికవేత్తలుగా మారేలా విద్యార్థులను తీర్చిదిద్దాలని ఆయన అన్నారు. పారిశ్రామికవేత్తలుగా మాత్రమే కాకుండా వినూత్న ఆలోచనా సరళిని విద్యార్థుల్లో పెంపొందించి, ఉద్యోగాల కోసం కాకుండా ఉద్యోగాలు ఇచ్చే వారిగా వారిని తయారు చేయాలని అన్నారు. ఈ విధానం వల్ల సామాజిక, ఆర్థిక, పర్యావరణ రంగాల్లో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకుంటాయని డాక్టర్ సర్కార్ అన్నారు. ఈ కలలు సాకారం అయ్యేలా చూసేందుకు ఇటీవల ప్రకటించిన నూతన విద్యా విధానం 2020 అవకాశం కల్పిస్తుందని అన్నారు.

రెండు సార్లు ఏఆర్ఐఐఏ ర్యాంకులను ప్రకటించి వాటిని అమలు చేస్తున్న అఖిల భారత సాంకేతిక విద్యా మండలి, విద్యా మంత్రిత్వ శాఖ ఇన్నోవేషన్ సెల్ చేసిన కృషిని డాక్టర్ సర్కార్ ప్రశంసించారు. ఏఆర్ఐఐఏ నాల్గవ దశ ప్రక్రియను మంత్రి ప్రారంభించారు.

అఖిల భారత సాంకేతిక విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ అనిల్ సహస్రబుద్ధే మాట్లాడుతూ జాతీయ మరియు అంతర్జాతీయ అంశాలను పరిగణనలోకి తీసుకొని ఏఆర్ఐఐఏ ర్యాంకింగ్ విధానాన్ని రూపొందించామని వివరించారు. స్వదేశీ ఆవిష్కరణ మరియు వ్యవస్థాపకత ర్యాంకింగ్ విధానం వల్ల ఉన్నత విద్యాసంస్థల పనితీరు మెరుగుపడుతుందని అన్నారు. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో భారత్ స్థానాన్ని మరింత మెరుగు పరిచేలా చూసేందుకు సంస్థలు తమ లక్ష్యాలను నిర్ణయించు కునేందుకు ర్యాంకింగ్ విధానం దోహదపడుతుందని అన్నారు.

ఏఆర్ఐఐఏ ర్యాంకింగ్ విధానంలో అనుసరించిన విధానాన్ని అదనపు కార్యదర్శి (సాంకేతిక విద్య) శ్రీ రాకేష్ రంజన్ వివరించారు. విద్యా సంస్థలకు దిశ దశలను నిర్దేశిస్తూ ఇన్నోవేషన్ సెల్ ర్యాంకింగ్ విధానాన్ని రూపొందించిందని పేర్కొన్నారు. దీనివల్ల అంతర్జాతీయ ప్రమాణాల మేరకు సంస్థలు పనిచేయగలుగుతాయని అన్నారు. అంతర్జాతీయ సంస్థలతో పోటీ పడి ఆవిష్కరణ, అంకుర సంస్థల అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ర్యాంకింగ్ వ్యవస్థ రూపకల్పన లో సహకరించిన అన్ని సంస్థలను శ్రీ రంజన్ అభినందించారు.

విద్యార్థులు, అధ్యాపక సిబ్బందిలో ఆవిష్కరణలు, అంకుర సంస్థలు, వ్యవస్థాపక అభివృద్ధి సూచికల ఆధారంగా భారతదేశంలోని అన్ని ప్రధాన ఉన్నత విద్యా సంస్థలకు క్రమపద్ధతిలో ర్యాంకింగ్ ఇచ్చేందుకు కేంద్ర విద్యా శాఖ అటల్ ర్యాంకింగ్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ ఆన్ ఇన్నోవేషన్ అచీవ్‌మెంట్స్(ఏఆర్ఐఐఏ)ను అమలు చేస్తోంది.

పేటెంట్ల కోసం చేసిన దరఖాస్తులు, పొందిన పేటెంట్లు, విద్యార్థుల సంఖ్య, సిబ్బంది ప్రారంభించిన అంకుర సంస్థలు, అంకుర సంస్థల కోసం సేకరించిన నిధులు,ఆవిష్కరణలు, అంకుర సంస్థల కోసం సంస్థలో కల్పించిన ప్రత్యేక మౌలిక సదుపాయాలు లాంటి సూచికలను ఆధారంగా చేసుకుని ఈ ర్యాంకింగ్ లు ఇవ్వడం జరుగుతోంది.

కేంద్ర నిధులతో పనిచేస్తున్న సాంకేతిక సంస్థలు (ఉ

వెదురు అభివృద్ధిపై నీతి ఆయోగ్ నిర్వహించనున్న జాతీయ వర్క్ షాప్

న్యూఢిల్లీ, డిసెంబర్ 30:నీతి ఆయోగ్ వైస్ చైర్మన్ డాక్టర్ రాజీవ్ కుమార్, శాస్త్ర సాంకేతికత, భూగర్భ శాస్త్ర మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి (స్వతంత్ర బాధ్యత) డాక్టర్ జితేంద్ర కుమార్, నీతి ఆయోగ్ సభ్యులు డాక్టర్ వీకే సారస్వత్ , ముఖ్య కార్యనిర్వహణాధికారి అమితాబ్ కాంత్ ఈ గోష్టి ప్రారంభిస్తారు.

వెదురు అభివృద్ధిలో అవకాశాలు సవాళ్లను అర్థం చేసుకోవడానికి, వెదురు రంగంలోని మొత్తం విలువ-గొలుసులో అనుసంధానాలను అన్వేషించడానికి తదనుగుణంగా ఈ రంగానికి వ్యూహాలు దిశానిర్దేశం చేయడానికి భారతదేశం విదేశాల నుంచి అనేక మంది భాగస్వాములు ఈ గోష్ఠికి హాజరవుతారు.

వర్క్ షాప్‌లో నాలుగు సాంకేతిక సమావేశాలు ఉంటాయి. మొదట 'వెదురు ఉత్పత్తి, విలువ జోడింపు, అంతర్జాతీయ అనుభవం', రెండవది 'వివిధ రంగాల్లో ప్రభుత్వ విధానాలు, కార్యక్రమాలు, అవకాశాలు', మూడవది 'వెదురులో సర్క్యులర్ ఎకానమీ', చివరి సెషన్ 'జాతీయ ,అంతర్జాతీయ ఉత్తమ పద్ధతులు'.

వెదురు వినియోగం వాణిజ్యీకరణను పెంచడానికి, నీతి ఆయోగ్ భారతీయ వెదురు పరిశ్రమ యొక్క సమగ్ర అభివృద్ధికి ఆచరణాత్మక విధానాలు/సాంకేతికతలను రూపొందించే ప్రక్రియలో ఉంది. దీని ప్రకారం 'వెదురు డెవలప్‌మెంట్ మిషన్ డాక్యుమెంట్' అనే టెక్నో-కమర్షియల్ నివేదికను సిద్ధం చేస్తోంది. భారతదేశంలో సాగు, ఉత్పత్తి, ప్రక్రియ నుండి ప్రామాణీకరణ వినియోగం వరకు పూర్తి వెదురు విలువ-గొలుసును విశ్లేషించాలని నివేదిక యోచిస్తోంది.

వెదురు రంగం సామర్థ్యాన్ని ఉపయోగించుకోవడానికి దేశీయ పరివర్తన సంస్థ ఔమిఎ-ప్రయత్నాలు గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో మరింత ఉపాధిని సృష్టించడం, రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయడం, విలువ జోడింపు మెరుగుపరచడం, ఎగుమతులకు పూరకంగా వెదురు ఉత్పత్తులను వైవిధ్య పరచడం వంటి వాటిపై ప్రధానంగా దృష్టి సారించాయి.

ఏపీలో మూతపడిన థియేటర్స్‌కు జగన్ గుడ్ న్యూస్

అమరావతి, డిసెంబర్ 30:ఏపీలో సీజ్ చేయబడిన థియేటర్స్ కు గుడ్ న్యూస్ తెలిపారు ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి. నిబంధనలు పాటించని పలు థియేటర్స్ ను అధికారులు సీజ్ చేసిన సంగతి తెలిసిందే.ఈ తరుణంలో సీజ్ చేయబడిన థియేటర్స్ కు ఓపెన్ చేసేందుకు అనుమతి ఇచ్చింది జగన్ మోహన్ రెడ్డి సర్కార్. నెల రోజుల గడువుతో నోటీసులు ఇవ్వనున్న జేసీలు.. ఈ గడువు లోపు పెనాల్టీలు కట్టి సరిచేసుకునే వెసులుబాటు కల్పించింది. ఈ నిర్ణయం తో 9 జిల్లాల్లోని 83 థియేటర్లు మళ్ళీ ఓపెన్ కానున్నాయి. ఈ మేరకు జాయింట్ కలెక్టర్ కు దరఖాస్తు చేసుకోవాలని థియేటర్ యజమానులకు సూచించారు మంత్రి పేర్ని నాని.

గురువారం మచిలీపట్నంలో మంత్రి పేర్ని నానితో సినీ నటుడు, నిర్మాత ఆర్ నారాయణమూర్తి, పలువురు సినిమా థియేటర్స్ ఓనర్లు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఏపీలో థియేటర్ల ఓనర్లకు ఊరటనిస్తూ మంత్రి పేర్ని నాని హామీ ఇచ్చారు. సీజ్ చేసిన థియేటర్లు తిరిగి ఓపెన్ చేసేందుకు అనుమతిచ్చారు. అయితే థియేటర్లలో అన్ని వసతులు కల్పించాలని ఆదేశించారు.

ప్రభుత్వ నిబంధనల ప్రకారం పనిచేయని థియేటర్లలో తనిఖీలు నిర్వహించడంతో పాటు పలు చర్యలు కూడా తీసుకుంది. టికెట్ల రేట్లు ఎక్కువగా ఉన్నా, క్యాంటీన్లలో రేట్లు పెంచినా, లైసెన్స్ లు లేకున్నా చర్యలకు దిగింది. దీంతో థియేటర్ల యాజమాన్యాలతో పాటు డిస్ట్రిబ్యూటర్లు బెంబెలెత్తారు. ప్రభుత్వం వద్దకు పరుగులు తీశారు. ఈ నేపథ్యంలో సినిమాటోగ్రఫీ మంత్రి పేర్నినాని వారితో చర్చలు జరిపి థియేటర్స్ ఓపెన్ కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.

మేడారం జాతర పనులను పరిశీలించిన మంత్రులు

ములుగు,డిసెంబర్ 30 : ములుగు జిల్లా తాడ్వాయి మండలంలో మేడారం జరగనున్న ఆసియా ఖండంలోనే అతి పెద్ద మహా జాతర అయిన మేడారం-2022 పనుల పరిశీలన, సమీక్ష సమావేశానికి తెలంగాణ రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి, గిరిజన అభివృద్ధి శాఖమంత్రి సత్యవతి రాథోడ్, ములుగు జడ్పీ చైర్మన్ కుసుమ జగదీష్ చేరుకున్నారు. జంపన్న వాగులో జంపన్న దేవుడికి మొక్కులు చెల్లించి .. మేడారం వన దేవతలు శ్రీ సమ్మక్క సారక్కలను దర్శించుకున్నారు. వారి వెంట జిల్లా కలెక్టర్ కృష్ణ ఆదిత్య, జడ్పీ వైస్ చైర్మన్ బడే నాగ జ్యోతి, ఎంపీపీ గొంది వాణి శ్రీ, రైతు బంధు జిల్లా అధ్యక్షులు పల్లా బుచ్చయ్య, మండల, నియోజకవర్గ, జిల్లా నాయకులు, జిల్లా అధికారులు, పాల్గొన్నారు.

మాజీ మంత్రి ఫరిదొద్దిన్ పార్థివదేహానికి ఘన నివాళు..!

-మున్సిపల్, పరిశ్రమలు మరియు ఐటీ శాఖ మంత్రి కె.తారకరామారావు.

-ఫరిదొద్దిన్ మహా నాయకుడు , మహోన్నత వ్యక్తిత్వం కలిగిన వారు.

-మహా నాయకుడిని కోల్పోయాం, రాష్ట్రానికి ఎనలేని సేవలందించారు.

సంగారెడ్డి, డిసెంబర్ 30 (నేటినిజం ప్రతినిధి) అకాల మరణానికి గురైన మాజీ మంత్రి ఫరిదొద్దిన్ పార్థివదేహానికి రాష్ట్ర మున్సిపల్, పరిశ్రమలు మరియు ఐటీ శాఖ మంత్రి కె.తారకరామారావు గురువారం జహీరాబాద్ పట్టణం లోని బాగారెడ్డి స్టేడియంలో ఘనంగా నివాళులర్పించారు.

మాజీ మంత్రి ఫరిదొద్దిన్ పార్థివదేహానికి రాష్ట్ర హోం శాఖ మాత్యులు మహమూద్ అలీ, ఎంపీలు బీబీ పాటిల్, కొత్త ప్రభాకర్ రెడ్డి, జెడ్పి చైర్ పర్సన్ మంజుశ్రీ జైపాల్ రెడ్డి,శాసన మండలి ప్రోటైం చైర్మన్ వి .భూపాల్ రెడ్డి ,శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు, వివిధ హోదాలలో ఉన్న కార్పొరేషన్ చైర్మన్లు, మాజీ పార్లమెంట్ సభ్యులు, జిల్లా కలెక్టర్ హనుమంతరావు, ఇతర ప్రజాప్రతినిధులు, అన్ని వర్గాల ప్రజలు నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా మంత్రి తారక రామారావు మాట్లాడుతూ ఫరిదొద్దిన్ అందరికీ సుపరిచితులు, ఆప్తుడు, అజాతశత్రువు ,సౌమ్యుడని అన్నారు. కులమతాలకు, పార్టీలకు అతీతంగా ప్రేమగా పలకరించి దగ్గరికి తీసుకునే మంచి వ్యక్తి అని కొనియాడారు. ఫరిదొద్దిన్ గారి అకాల మరణం అందరిని తీవ్రగ్రాంతికి,కలతకు గురి చేసిందన్నారు.గౌరవ ముఖ్యమంత్రి కూడా తీవ్రగ్రాంతిని వ్యక్తం చేశారన్నారు.

మహా నాయకుడు ,మంచి వ్యక్తిత్వం గల ఫరిదొద్దిన్ గారు లేకపోవడం టిఆర్ఎస్ పార్టీకి,వారి కుటుంబానికే కాకుండా పూర్వ మెదక్ జిల్లా మొత్తానికి తీరనిలోటన్నారు.వివిధ హోదాలలో పని చేసిన ఆయన రాష్ట్రానికి ఎనలేని సేవలందించారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ పూర్తి అధికార లాంఛనాలతో వారి అంత్యక్రియలను పూర్తి చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారన్నారు. ఆ మేరకు ఫరిదొద్దిన్ స్వగ్రామం హోతీ ' బి ' గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వ పూర్తి అధికార లాంఛనాలతో అంత్యక్రియలను చేస్తున్నట్లు తెలిపారు.పార్టీ తరఫున రాష్ట్ర ప్రజల తరఫున ఫరిదొద్దిన్ గారి కుటుంబానికి తీవ్ర సంతాపాన్ని, సానుభూతిని తెలియజేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. ఈ కష్ట సమయంలో వారి కుటుంబానికి మనోధైర్యాన్ని ప్రసాదించాలని కోరుకున్నారు. అదేవిధంగా ఫరిదొద్దిన్ గారి ఆత్మకు శాంతి కలగాలని మంత్రి కోరారు.అనంతరం హోతి బి గ్రామం లో ప్రభుత్వ అధికార లాంఛనాలతో అంత్యక్రియలను చేశారు.ప్రభుత్వం తరఫున మంత్రితో పాటు రాష్ట్ర హోం శాఖ మాత్యులు ఎంపీలు జడ్పీ చైర్పర్సన్ ఎమ్మెల్యేలు శాసనమండలి సభ్యులు టిఆర్ఎస్ పార్టీ వివిధ హోదాల ప్రతినిధులు, ప్రజలు అంత్యక్రియలలో పాల్గొని ఘనంగా నివాళులు అర్పించారు.

ఆర్ఈసీ అనుబంధ సంస్థ సీపీడీసీఎఆర్ఈల్ 'కల్లం ట్రాన్స్‌మిషన్ లిమిటెడ్', ప్రాజెక్ట్ ఎస్‌పీవీని ఇండిగ్రిడ్ 1 లిమిటెడ్ మరియు ఇండిగ్రిడ్ 2 లిమిటెడ్ కన్సార్టియంకు అప్పగింత

న్యూఢిల్లీ, డిసెంబర్ 30:విద్యుత్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని ఎన్‌బీఎఫ్‌సీ నవరత్న సీపీఎస్‌యు అయిన ఆర్ఈసీ లిమిటెడ్ పూర్తిస్థాయి అనుబంధ సంస్థ 'ఆర్ఈసీ పవర్ డెవలప్‌మెంట్ అండ్ కన్సల్టెన్సీ లిమిటెడ్' (సీపీడీసీఎఆర్ఈల్) దేశంలో ట్రాన్స్‌మిషన్ ప్రాజెక్ట్ నిర్మాణం కోసం రూపొందించిన ప్రాజెక్ట్ నిర్దిష్ట ఎస్‌పీవీ (స్పెషల్ పర్పస్ వెహికల్) ఇండిగ్రిడ్ 1 లిమిటెడ్, ఇండిగ్రిడ్ 2 లిమిటెడ్ కన్సార్టియంకు అప్పగించింది. 'మహారాష్ట్రలోని ఉస్మానాబాద్ ప్రాంతంలో (1 గిగావాట్లు) ఉన్న ఆర్ఈ ప్రాజెక్ట్‌ల నుండి ఇండిగ్రిడ్ -1 లిమిటెడ్ మరియు ఇండిగ్రిడ్ 2 లిమిటెడ్ యొక్క కన్సార్టియంకు విద్యుత్ తరలింపు ట్రాన్స్‌మిషన్ సిస్టమ్ నిమిత్తం కోసం 2021 డిసెంబర్ 28వ తేదీని దీనిని అప్పంగించారు. భారత ప్రభుత్వ విద్యుత్ మంత్రిత్వ శాఖ ఇంటర్-స్టేట్ ట్రాన్స్‌మిషన్ ప్రాజెక్ట్‌ల నిమిత్తం ఇండిగ్రిడ్ -1 లిమిటెడ్, ఇండిగ్రిడ్-2 లిమిటెడ్ కన్సార్టియం విజయవంతమైన బిడ్డర్‌గా నిలిచింది. బిడ్ ప్రాసెస్ కోఆర్డినేటర్‌గా ఆర్ఈసీపీడీసీఎల్ నిలిచింది. ఆర్ఈసీపీడీసీఎల్ సీఈఓ శ్రీ ఆర్. లక్ష్మణన్, జాయింట్ సీఈఓ టీఎస్‌సీ బోస్‌లు ఎస్‌పీవీని ఇండిగ్రిడ్ 1 లిమిటెడ్ సంస్థకు చెందిన శ్రీ బిగ్యాన్ పారిజాకు, ఇండిగ్రిడ్ 2 లిమిటెడ్‌కు చెందిన శ్రీ ఆదిత్య కిస్లేకు అప్పగించారు.

భారత ప్రభుత్వ విద్యుత్ మంత్రిత్వ శాఖ నోటిఫై చేసిన స్టాండర్డ్ బిడ్డింగ్ డాక్యుమెంట్‌లు మరియు మార్గదర్శకాలకు అనుగుణంగా ట్రాన్స్‌మిషన్ డెవలపర్‌ల ఎంపిక కోసం టారిఫ్ బేస్డ్ కాంపిటేటివ్ బిడ్డింగ్ (టీబీసీబీ) ప్రక్రియ ద్వారా విజయవంతమైన బిడ్డర్ ఎంపిక జరిగింది.

ఈ పనిలో కల్లం వద్ద 400/220 కేవీ సబ్-స్టేషన్ మరియు 400 కేవీ డబుల్ సర్క్యూట్ పార్లి - పూణే ట్రాన్స్‌మిషన్ లైన్ యొక్క ఎల్ఐఎల్ఓ ఏర్పాటు తదితర పనులు ఉన్నాయి. 18 నెలల్లో ప్రాజెక్టు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

ఆర్ఈసీ లిమిటెడ్ గురించి: ఆర్ఈసీ లిమిటెడ్ అనేది భారతదేశం అంతటా విద్యుత్ రంగం ఫైనాన్సింగ్ మరియు అభివృద్ధిపై దృష్టి సారించిన నవరత్న ఎన్‌బీఎఫ్‌సీ సంస్థ. 1969లో స్థాపించబడిన ఆర్ఈసీ లిమిటెడ్ సంస్థ తన కార్యకలాపాల ప్రాంతంలో యాభై సంవత్సరాల సేవను పూర్తి చేసుకుంది.

ఇది రాష్ట్ర విద్యుత్ బోర్డులు, రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర/రాష్ట్ర విద్యుత్తు వినియోగ సంస్థలు, స్వతంత్ర విద్యుత్ ఉత్పత్తిదారులు, గ్రామీణ విద్యుత్ సహకార సంఘాలు, ప్రైవేట్ రంగ వినియోగాలకు కూడా ఆర్థిక సహాయాన్ని అందిస్తుంది. దీని వ్యాపార కార్యకలాపాలు పూర్తి పవర్ సెక్టార్ వాల్యూ చైన్‌లో ఫైనాన్సింగ్ ప్రాజెక్ట్‌లను కలిగి ఉంటాయి; వివిధ రకాల ప్రాజెక్ట్‌లలో జనరేషన్, ట్రాన్స్‌మిషన్, డిస్ట్రిబ్యూషన్ మరియు రెన్యూవబుల్ ఎనర్జీ విభాగాలు ఉన్నాయి. ఆర్ఈసీ యొక్క నిధులు భారతదేశంలోని ప్రతి నాలుగో బల్బును ప్రకాశింపజేస్తూ తన సేవలను అందిస్తోంది.

వాయు కాలుష్య కారకాలు, వాతావరణ మార్పులు పుప్పొడి ఏకాగ్రతను ప్రభావితం చేస్తాయి: అధ్యయనం

న్యూఢిల్లీ, డిసెంబర్ 30:వాయు కాలుష్య కారకాలు పుప్పొడి ఏకాగ్రతను ప్రభావితం చేస్తాయని, అదేవిధంగా, వివిధ రకాల పుప్పొడి వాతావరణ పరిస్థితులకు ప్రత్యేకమైన ప్రతిస్పందనను కలిగి ఉంటుందని, శాస్త్రవేత్తలు కనుగొన్నారు.

పుప్పొడి గాలిలో నిలిచిపోయి, మనం పీల్చే గాలిలో భాగంగా ఉంటుంది. మానవులు పీల్చినప్పుడు, అది ఎగువ శ్వాసకోశ వ్యవస్థ పై ఒత్తిడిని కలగజేస్తుంది. అప్పుడు వారు విస్తృతమైన ఎగువ శ్వాసకోశ ఇబ్బందితో పాటు, ఉబ్బసం, కాలానుగుణ శ్లేష్మం, శ్వాసకోశానికి సంబంధించిన మంట వంటి వ్యక్తీకరణలతో ముక్కుకు సంబంధించిన శ్వసకోశ అలెర్జీలకు గురౌతారు.

వైవిధ్యమైన వాతావరణ లేదా పర్యావరణ పరిస్థితుల కారణంగా గాలిలో ఉండే పుప్పొడి స్వభావం ఒక్కో ప్రదేశంలో, ఒక్కో రకంగా మారుతూ ఉంటుంది. పట్టణ వాతావరణంలో అలెర్జీ వ్యాధులను పెంచడంలో గాలిలో పుప్పొడి కీలక పాత్ర పోషిస్తుందనే విషయమైతే స్పష్టమైన ఆధారాలు ఉన్నాయి. పుప్పొడి, వాతావరణ మార్పులు, వాయు కాలుష్య కారకాలు ప్రకృతిలో సహజీవనం చేస్తున్నందున, అవి ఒకదానితో ఒకటి సంకర్షణ చెందే అవకాశం ఉండడంతో, అవి మానవ ఆరోగ్యంపై వాటి ప్రతికూల ప్రభావాలను మరింత తీవ్రతరం చేస్తాయి.

ఈ విషయాలను పరిగణలోకి తీసుకుని, పర్యావరణ అధ్యయనాల విభాగం చైర్‌పర్సన్ డాక్టర్ సుమన్ మోర్, పి.హెచ్.డి. పరిశోధకురాలు శ్రీమతి. అక్షి గోయల్ తో కలిసి, చండీగఢ్‌లోని పోస్ట్ గ్రాడ్యుయేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (పి.జి.ఐ.ఎం.ఈ.ఆర్) నుండి ప్రొఫెసర్ రవీంద్ర ఖైవాల్, చండీగఢ్ నగరం లోని గాలిలో ఉండే పుప్పొడి పై వాతావరణ, వాయు కాలుష్య కారకాల ప్రభావాన్ని అధ్యయనం చేశారు. ఈ బృందం ఉష్ణోగ్రత, వర్షపాతం, గాలిలో తేమ, గాలి వేగం, దిశ, పరిసర వాయు కాలుష్య కారకాలు ప్రధానంగా, గాలిలో సూక్ష్మ నలుసులు, నైట్రోజన్ ఆక్సైడ్, గాలిలో ఉండే పుప్పొడి కి గల సంబంధాలను అన్వేషించింది.

ఈ అధ్యయనానికి భారత ప్రభుత్వ శాస్త్ర, సాంకేతిక శాఖ (డి.ఎస్.టి), ఆర్థిక సహకారాన్ని అందించింది. వాయు కాలుష్య కారకాలు, గాలిలో పుప్పొడి పై వాతావరణ మార్పుల ప్రభావాన్ని అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తూ, భారతదేశంలో చేపట్టిన మొదటి అధ్యయనాలలో ఇది ఒకటి. ఈ అధ్యయనం ఇటీవలే, ఎల్సెవియర్ కి చెందిన ''సైన్స్ ఆఫ్ ది టోటల్ ఎన్విరాన్‌మెంట్'' అనే పత్రికలో ప్రచురితమయ్యింది.

అధ్యయనం చేసిన ప్రతి పుప్పొడి రకం వాతావరణ పరిస్థితులు, వాయు కాలుష్య కారకాలకు ప్రత్యేకమైన ప్రతిస్పందనను కలిగి ఉన్నట్లు, అధ్యయనం సూచిస్తోంది. వసంత ఋతువు, శరదృతువు లలో పుష్పించే కాలంలోనే పుప్పొడి రకాలు ఎక్కువగా లభిస్తాయి. సాధారణ ఉష్ణోగ్రత, తక్కువ తేమ, తక్కువ అవపాతం వంటి అనుకూల వాతావరణ పరిస్థితులలో గాలిలో పుప్పొడి అత్యధికంగా లభిస్తుంది. పుష్పించే, పుష్పగుచ్ఛము, పరిపక్వత, పుప్పొడి విడుదల, వ్యాప్తిలో మితమైన, సాధారణ ఉష్ణోగ్రత ముఖ్యమైన పాత్ర పోషిస్తుందని గమనించడం జరిగింది. దీనికి విరుద్ధంగా, అవపాతం తక్కువగా, గాలిలో తేమ ఎక్కువగా ఉన్న సమయంలో వాతావరణం నుండి పుప్పొడి రేణువులు తొలగించబడతాయి.

గాలిలో ఉండే పుప్పొడి యొక్క సంక్లిష్టమైన, అస్పష్టమైన సంబంధం వాయు కాలుష్య కారకాలతో సూచించబడింది. ఈ సంబంధంలోని పోకడలను నిర్ధారించడానికి శాస్త్రవేత్తలు దీర్ఘకాలిక సమాచార సెట్ లను పరిశీలించాలని ప్రణాళిక రూపొందించుకుంటున్నారు.

వాతావరణ భవిష్యత్తు పరంగా, పట్టణ వాతావరణం మొక్కల జీవ మరియు శీతోష్ణస్థితి కి సంబంధించిన కొలమానాలను గణనీయంగా ప్రభావితం చేస్తుందని అంచనా వేస్తున్నట్లు ప్రొఫెసర్ రవీంద్ర ఖైవాల్ ప్రత్యేకంగా పేర్కొన్నారు.

అందువల్ల, అధ్యయనం యొక్క ఫలితాలు వాయు కాలుష్య కారకాలు పుప్పొడి ఏకాగ్రతను ప్రభావితం చేస్తాయని మరియు భవిష్యత్తులో డేటా సెట్ విస్తరిస్తున్నందున మరింత అన్వేషించవచ్చని ఉపయోగకరమైన పరికల్పనలను రూపొందిస్తుంది.ప్రస్తుత అధ్యయనం యొక్క ఫలితాలు గాలిలో పుప్పొడి, వాయు కాలుష్య కారకాలు, వాతావరణ మార్పులు మధ్య సంక్లిష్ట పరస్పర చర్యల అవగాహనను మెరుగుపరచడానికి, తగిన ఉపశమన విధానాలను రూపొందించడానికి, ఇండో-గంగా మైదాన ప్రాంతంలో పొలినోసిస్ భారాన్ని తగ్గించడానికి, సహాయ పడతాయి. ఈ ప్రాంతం ప్రత్యేకంగా అక్టోబర్, నవంబర్ నెలల్లో వాయు కాలుష్యానికి హాట్-స్పాట్ గా గుర్తించబడింది.

మే, 2022 నుంచి ప్రారంభం కానున్న పాండు షిప్ రిపేర్ ఫెసిలిటీ నిర్మాణం, రెండేళ్ళలో పూర్తి- శ్రీ సర్బానంద్ సోనోవాల్

న్యూఢిల్లీ, డిసెంబర్ 30:గువాహతిలోని పాండు షిప్ రిపేర్ ఫెసిలిటీ (నౌకా మరమ్మత్తుల సదుపాయం) పురోగతిని సమీక్షించేందుకు కేంద్ర రేవులు, షిప్పింగ్ ఉ జలమార్గాలు, ఆయుష్ శాఖ మంత్రి శ్రీ సర్బానంద్ సోనోవాల్ సోవారం (27.12.21) ఇన్‌ల్యాండ్ వాటర్‌వేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఐడబ్ల్యుఎఐ), కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్, ఐఐటీ మద్రాస్‌కు చెందిన ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. ఈ సదుపాయ నిర్మాణ కార్యకలాపాలు మే, 2022 నుంచి ప్రారంభించవలసి ఉన్నందున దానికి సంబంధించిన సాంకేతిక పని పూర్తి చేస్తున్నారని మంత్రి తెలిపారు. ఈ ప్రాజెక్టును రెండేళ్ళలోపు, అంటే 2024కి పూర్తి చేయాలన్నది లక్ష్యం. నూతన నౌకా మరమ్మత్తుల సదుపాయానికి సంబంధించిన ప్రకటన 26 ఆగస్టు, 2021న వెలువడింది. ఈ సదుపాయం ప్రాంత ఆర్థిక పునరుద్ధరణకు ప్రధానంగా దోహదం చేయనుంది. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన నమూనా, అమలును ఐడబ్ల్యుఎఐ, కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ సంయుక్తంగా చేపడుతున్నాయి. దీనికి సాంకేతిక మద్దతును ఐఐటీ, మద్రాస్ అందిస్తోంది. స్లిప్‌వేగా పేర్కొనే ఈ సదుపాయాన్ని అస్సాం ప్రభుత్వం అందించిన 3.67 ఎకరాల భూమిలో అభివృద్ధి చేయనున్నారు. ఈశాన్య ప్రాంత భవిష్యత్ ప్రగతి జలమార్గాల అభివృద్ధిలోనే ఉందని మంత్రి వివరించారు.జాతీయ జలమార్గం-2- బ్రహ్మపుత్ర తో పాటుగా జాతీయ జలమార్గం 6 - బార్క్‌లో పని ప్రారంభమైందని, ఇవి సరుకు రవాణా, ప్రయాణీకుల రవాణాతో పాటుగా పర్యాటకుల పడవలతో సౌలభ్యంతో ఈ ప్రాంత ఆర్థికాభివృద్ధికై తోడ్పడతాయని ఆయన వివరించారు. మోటారు సామర్థ్యం గల జలమార్గాలను సాధించేందుకు, రెండు నదుల పూడికలను కీలక సమయాల్లో తీయవలసి ఉంటుందని, తద్వారా సరకు రవాణా ఓడల రాకపోకలకు తగినంత లోతును సాధించవచ్చు, అని ఆయన అన్నారు. సరుకు, ప్రయాణీకులను సాఫీగా, వేగవంతంగా తరలించేందుకు నదులను జలమార్గాలుగా అభివృద్ధి చేయడం ద్వారా మన గొప్ప ఆర్థిక చరిత్రను పునరుద్ధరించవచ్చని శ్రీ సోనోవాల్ పేర్కొన్నారు. మొత్తం ఈశాన్య ప్రాంత ఎగుమతులను ప్రోత్సహించడమే కాక, ఈ ప్రాంతంలో ఉపాధి కల్పనా అవకాశాలను ప్రధానంగా ద్విగుణీకృతం చేస్తుందని ఆయన చెప్పారు. జలమార్గాల అభివృద్ధికి అన్ని ఈశాన్య ప్రాంత రాష్ట్ర ప్రభుత్వాలూ మద్దతునందించాయన్నారు. ప్రజలు ఫలాలను పొంది, అభివృద్ధి చెందేందుకు రాష్ట్రప్రభుత్వాలతో కలిసి మేం- అనగా కేంద్రం ఎటువంటి ఆటంకాలూ లేకుండా కలసి పని చేస్తామని ఆయన తెలిపారు.

ముసి ముసి నవ్వుల చిరుప్రాయం బాల్యం, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన సామాజిక బాధ్యత

-జిల్లా అదనపు ఎస్పీ నితిక పంత్.

సంగారెడ్డి డిసెంబర్ 30 (నేటినిజం ప్రతినిధి):బుధవారం నాడు జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా అదనపు ఎస్పీ నితిక పంత్, ఐ.పి.యస్ గారు ఆపరేషన్ స్మైల్ గురించి మాట్లాడుతూ.... ఇప్పటికీ ప్రపంచాన్ని పట్టి పీడిస్తున్న సమస్యల్లో బాల కార్మిక వ్యవస్థ ఒకటిని, కార్మికులుగా పనిచేసే 5 నుంచి 14 ఏళ్లలోపు పిల్లల్ని బాలకార్మికులుగా పరిగణిస్తారని, పిల్లలు ఎవరైనా బాలకార్మికులుగా ఉన్నారంటే వారి ప్రాథమిక హక్కులకు భంగం కలిగినట్లేనని, బాల కార్మికులుగా కొనసాగినవారు భవిష్యత్‌లో ఉన్నతమైన జీవితాన్ని గడిపేందుకు అవకాశాలు తక్కువగా ఉంటాయని, వీరికి సరైన విద్య లేకపోవడంతో ఉద్యోగ అవకాశాలు తగ్గిపోతున్నాయని, పోటీతత్వంతో నిండిన సమాజంలో అన్నిరకాలుగా వెనుకబడిపోతున్నారని, ఉద్యోగం దొరకని కారణంగా నేరాలకు పాల్పడుతున్నారని, ఉపాధి మార్గాలు వెతుక్కునేందుకు సరైన మార్గం, ఆర్థిక తోడ్పాటు లేకపోవడం, నైపుణ్యలేమి వంటి కారణాల వల్లే ఇలా మారుతున్నారని, నేటి బాలలే రేపటి పౌరులని, చిన్నారులే దేశ ప్రగతికి సోపానాలని, కానీ అభివృద్ధిలో పరుగులు పెడుతున్న నేటి హైటెక్ యుగంలోనూ ఇంకా వెట్టిచాకిరి వ్యవస్థ చిన్నారుల బాల్యాన్ని చిదిమేస్తోందిని. బాలకార్మిక వ్యవస్థ.. చిట్టి చేతులను చిత్ర హింసలు పెడుతోందిని, బాల్యం ఎంతో అందమైనదని అలాంటి బాల్యం వారికి జీవితాంతం మానని గాయం చేస్తుందన్నారు.

ఏ దేశంలో బాలకార్మికులు లేని, ఆరోగ్యవంతమైన బాలలుంటారో ఆ దేశం అభివృద్ధిలో ముందుంటుందని, బాల కార్మికులుగా మారడానికి ముఖ్యంగా పిల్లలు అనాథలు కావడం, కుటుంబ పేదరికం, నిరక్షరాస్యత తదితర కారణాలవల్ల బాలలు కార్మికులుగా మారుతున్నారని, కనీస అవసరాలకు సరిపడా ఆదాయం దొరకని అనేక కుటుంబాలు తమ పిల్లల్ని పనుల్లో చేర్పిస్తున్నాయని, చిట్టి,చిట్టి చేతులతో పనులు చేస్తూ బతుకు బండిని లాగుతున్నారని, వారు పనిచేసే చోట సరైన సమయానికి తిండి దొరకక పస్తులుఉంటూ రోగాలపాలవుతున్నారని, బాలకార్మిక రక్కసి కబంధ హస్తాల నుంచి చిన్నారులకు విముక్తి కల్పించే లక్ష్యంతో ఆపరేషన్ స్మైల్ అనే బృహత్తర కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేస్తున్నామని, 2014 నుంచి ప్రతి ఏటా జనవరి నెలలో ఈ ఆపరేషన్ స్మైల్‌ను నిర్వహించడంతో పాటు? జులై నెలలో ముస్కాన్ కార్యక్రమాన్ని వివిధ శాఖల సమన్వయంతో పోలీస్ శాఖ అమలు చేస్తోందని, బాల కార్మికులను పనిస్థలాల నుంచి తీసుకొచ్చి విద్యాబుద్ధులు నేర్పిస్తున్నామని, మిస్సింగ్ కేసులను చేధించి బాలబాలికల్ని తమ తల్లిదండ్రుల చెంతకు చేరుస్తున్నామని, బాధిత చిన్నారులకు బాసటగా నిలుస్తున్నామని పలువిదాలుగా బాలలకు అండగా ఉంటున్నాము అని తెలిపారు.

బాల కార్మికులు ఎవరైనా మీ కంట పడినా, ఎక్కడైనా పని చేస్తున్నట్లు సమాచారం ఉన్నా నేరుగా 1098 చైల్డ్ లైన్ టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చుని అట్టి వారికి కౌన్సిలింగ్ ఇచ్చి ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తున్నటువంటి చిల్డ్రన్స్ హోమ్‌కు తరలిస్తారని, అలాగే వారిని బడికి పంపే చర్యలు తీసుకుంటారని అట్టి పిల్లలకు ఎవరు లేకపోతే ప్రభుత్వ హాస్టళ్లకు పంపించి విద్యను అందిస్తారని తెలిపినారు. ఇట్టి కార్యక్రమంలో వివిధ శాఖలకు చెందిన అధికారులు బి. జాసన్ , లేబర్ డిపార్ట్మెంట్ అసిస్టెంట్ కమిషనర్ యం. సుప్రియ విద్య శాఖ,కె. విష్ణును మూర్తి , జి. బాలరాజు రెవెన్యూశాఖ., డా.భాస్కర్ డి యం ఓ రామకృష్ణ రెడ్డి మరియు ఆపరేషన్ స్మైల్ సబ్ డివిజన్ ఇంచార్జి యస్.ఐ లు పాల్గొన్నారు

ప్రధాని నరేంద్ర మోడీకి పాలనపై చక్కని పట్టు : పవార్

న్యూఢిల్లీ, డిసెంబర్ 30: దేశ రాజకీయ రంగంలో శరద్ పవార్ ఎంతో సీనియర్. ఆయన చేసే వ్యాఖ్యలకు ప్రాధాన్యం ఉంటుంది. ఇతర పార్టీ నేతలను విమర్శించడమే కాదు.. తనకు నచ్చితే మెచ్చుకోవడానికి ఆయన తటపటాయించరు. తాజాగా ప్రధాని నరేంద్ర మోడీ గురించి ఆయన చెప్పిన అభిప్రాయాలు ఆసక్తిని కలిగిస్తున్నాయి.

ప్రధాని నరేంద్ర మోడీకి పాలనపై పట్టుందని, అదే ఆయన బలమని శరద్ పవార్ అన్నారు. పుణెలో జరిగిన ఒక కార్యక్రమంలో భాగంగా పవార్ మాట్లాడారు. ప్రధాని తాను ఒక నిర్ణయం తీసుకుంటే దానిని అమలు చేసే విషయంలో అధికారులు, మంత్రులను ఒక్కతాటిపైన నడిపిస్తారని పవార్ చెప్పారు. "ఏదైనా ఒక పనిని ప్రారంభిస్తే అది పూర్తయ

టికెట్ల ధరలు ఒకే రకంగా ఉంటేనే పేద, మధ్య తరగతి ప్రజలకు ఉపయోగం

అమరావతి, డిసెంబర్ 30:వైస్సార్సీపీ ప్రభుత్వానికి, సినీ పరిశ్రమకు మధ్య ఎలాంటి విభేదాలు లేవని ఆ పార్టీ ఎమ్మెల్యే రోజా అన్నారు. అన్ని సినిమాల టికెట్ల ధరలు ఒకే రకంగా ఉంటేనే పేద, మధ్య తరగతి ప్రజలంతా సినిమా చూసే అవకాశం ఉంటుందని చెప్పారు. టికెట్ ధరల సమస్య అందరు నిర్మాతలది కాదని? భారీ బడ్జెట్ తో సినిమాలు తీసే నిర్మాతలు మాత్రమే టికెట్ రేట్లపై అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారని అన్నారు.

ఇక రాష్ట్రంలో వైద్య సదుపాయాలను పెంచేందుకు తమ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని చెప్పారు. ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు సీఎం జగన్ కట్టుబడి ఉన్నారని తెలిపారు. బీజేపీ, టీడీపీ నేతలు ఎన్ని అబద్ధాలు చెప్పినా జగన్ కు ఏమీ కాదని అన్నారు.

నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించిన మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య, కాంగ్రెస్ నేత ఆది శ్రీనివాస్

రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 30(నేటినిజం ప్రతినిధి):వేములవాడ పట్టణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షులు తోట లహరి నూతన సంవత్సర క్యాలెండర్ ను గురువారం మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య, కాంగ్రెస్ నేత ఆది శ్రీనివాస్ నూతన సంవత్సర క్యాలెండర్ను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించిన సందర్భంగా ఈ కొత్త సంవత్సరంలో అందరికీ మంచి జరగాలని రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని వారన్నారు. ఈ కార్యక్రమంలో రూరల్, అర్బన్, చందుర్తి, కోనరావుపేట, మండల అధ్యక్షులు పిల్లి కనకయ్య, వకుళాభరణం శ్రీనివాస్, చింతపంటి రామస్వామి, షేక్ ఫిరోజ్ పాష, నాయకులు సంఘ స్వామి యాదవ్, చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్, చిలుక రమేష్, నాగుల విష్ణుప్రసాద్ ధూమ్ మధు, కనికరపు రాకేష్, తంగెళ్ల గణేష్, సాబీర్, కూర దేవయ్య, నాగుల మహేష్, మస్తాన్ ప్రభాకర్, భాష రాజశేఖర్ తదితరులు ఉన్నారు

కళా ప్రదర్శన కొరకు ఈఓకి వినతి

రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 30(నేటినిజం ప్రతినిధి): శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానం కార్యనిర్వహణాధికారి కృష్ణ ప్రసాద్ ను గురువారం నృత్య కళా నికేతన్ వ్యవస్థాపక అధ్యక్షులు యెల్ల పోశెట్టి కలిసి అభినందన సంచికఅందజేయడంజరిగింది.అనంతరం సాంస్కృతిక సంస్థ కామారెడ్డి, కళాకారుల కళా ప్రదర్శన త్వరలో దేవస్థానము నందు ప్రదర్శించుట కొరకు అనుమతి కోరగా వెంటనే స్పందించి దేవస్థానంనందు కార్యక్రమం నిర్వహించుకోవడానికి వారు అనుమతి ఇవ్వడం జరిగింది ఈ.ఓ.కి కళాకారుల పక్షాన వేములవాడ సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు యెల్ల పోశెట్టి, అధ్యక్షుడు గంగా శ్రీకాంత్ సంస్థ ప్రధాన కార్యదర్శి మానువాడ లక్ష్మీ నారాయణ కృతజ్ఞతలు తెలియజేశారు.

ఫిబ్రవరి 12న ఛలో కృష్ణ మాదిగ విద్యార్థి గర్జన సభను విజయవంతం చేయండి

రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 30(నేటినిజం ప్రతినిధి):హైదరాబాదులో జరగబోయే చలో ఫిబ్రవరి 12న మాదిగ విద్యార్థుల గర్జన సభను విజయవంతం చేయడానికై ఎమ్మార్పీఎస్ ఎం ఎస్ పి అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకులు మాట్లాడుతూ ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు చట్టబద్ధత కల్పించడం లో కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న తీవ్రమైన జాప్యానికి నిరసనగా ఫిబ్రవరి 12న హైదరాబాద్ లో తలపెట్టిన మాదిగ విద్యార్థుల గర్జన సభనువిజయవంతంగా చేయటకు ఎమ్మార్పీఎస్ ఎం ఎస్ ఎఫ్ కమిటీలు గ్రామ స్థాయి నుండి జిల్లావ్యాప్తంగా పూర్తిస్థాయి నిర్మాణం చేసుకుని విద్యార్థి గర్జన సభను విజయవంతం చేయాలని కోరారు .ఈ సమావేశంలో ఎం ఎస్ పి నాయకులు అవునురి ప్రభాకర్ ఎం ఎస్ పి నాయకులు గుండా థామస్ మాదిగ ఎం ఎస్ పి నాయకులు ఖానాపురం లక్ష్మణ్ బొల్లారం చంద్రమౌళి గుండెటీ రాజు అవునురి లక్ష్మణ్ గద్దరాశి భగవంతం పశుల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఇన్వెస్ట్ ఇండియాతో ఐటీసీ భాగస్వామ్యం

హైదరాబాద్, డిసెంబర్ 30:భారతదేశంలో సుప్రసిద్ధ పేపర్, పేపర్ బోర్డ్, స్పెషాలిటీ పేపర్ తయారీ సంస్థ ఐటీసీ పేపర్ బోర్డ్స్ అండ్ స్పెషాలిటీ పేపర్స్ డివిజన్ (పీఎస్‌పీడీ) ఇప్పుడు ఇన్వెస్ట్ ఇండియాతో భాగస్వామ్యం చేసుకుని ఐటీసీ సస్టెయినబిలిటీ ఇన్నోవేషన్ ఛాలెంజ్‌ను ప్రారంభించింది. సస్టెయినబల్ ప్యాకేజింగ్ మరియు స్మార్ట్ వేస్ట్ మేనేజ్‌మెంట్ పరిష్కారాలపై వినూత్నమైన స్టార్టప్ ఆలోచనలకు ఇది మద్దతునందిస్తుంది. స్టార్టప్ ఇండియా పోర్టల్ ద్వారా ఐటీసీ పీఎస్‌పీడీ ఇప్పుడు స్టార్టప్స్ నుంచి ఈ ఛాలెంజ్‌ల కోసం ప్రతిస్పందనలను ఆహ్వానిస్తోంది. ఈసందర్భంగా ఐటీసీ పీఎస్‌పీడీ సీఈవో వాదిరాజ్ కులకర్ణి మాట్లాడుతూ? పెద్దదైనా, చిన్నదైనా వ్యాపార సంస్థలు తమ అసాధారణ నిర్వహణ, వినూత్నమైన సామర్థ్యం, నిలకడైన ప్యాకేజింగ్, వ్యర్థ నిర్వహణ పరిష్కారాలతో సమాజంలోమార్పును తీసుకురావాల్సి ఉంటుందన్నారు. ఈ ఫిలాసఫీ నూతన ఐటీసీ సస్టెయినబిలిటీ ఇన్నోవేషన్ ఛాలెంజ్‌లో ప్రదర్శితమవుతుందన్నారు. ఇన్వెస్ట్ ఇండియా ఎండీ అండ్ సీఈవో దీపక్ బగ్లా మాట్లాడుతూ? సర్కులర్ ఆర్థిక వ్యవస్థ దిశగా భారతదేశం పయణించే రీతిలో మేడ్ ఇన్ ఇండియా పరిష్కారాలను ఇన్నోవేటివ్ స్టార్టప్స్ ప్రదర్శించగలవన్నారు. భారతదేశపు వృద్ధి కథలో భాగం కావాల్సిందిగా స్టార్టప్స్‌ను ఆహ్వానిస్తున్నామని అన్నారు.

పత్తి బస్తాల్లో రేషన్ బియ్యం నింపి వ్యాపారిని మోసం చేసిన రైతు

మహబూబాబాద్, డిసెంబర్ 30:ఈ ఏడాది పత్తికి మంచి రేటు పలుకుతుంది. క్వింటాకు ఏకంగా 9 వేల వరకు పలుకుతుంది. అయితే ఈసారి పత్తి దిగుబడి ఎక్కువ లేదు. భారీ వర్షాల కారణంగా పత్తి రైతులు నష్టపోయారు. మంచి రేటు ఉన్నప్పటికీ అధిక మొత్తంలో పత్తి దిగుబడి కాలేదు. పెట్టిన పెట్టుబడులు కూడా రాలేదని వాపోతున్నారు. ఈ తరుణంలో పంట దిగుబడి సరిగా రాలేదనో.. పెట్టుబడి ఎక్కువైందనో.. అప్పులు తీర్చుకోవాలనే తాపత్రయంతోనో తెలియదు కానీ ఓ రైతు మాత్రం పత్తి బస్తాల్లో రేషన్ బియ్యం నింపి..వాటిని మార్కెట్ కు తీసుకొచ్చాడు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో చోటుచేసుకుంది.

కారేపల్లి మండలాలనికి చెందిన ఓ రైతు బుధవారం 35 పత్తి బస్తాలను కే సముద్రం మార్కెట్‌కు తీసుకొచ్చాడు. వీటిని ఓ ట్రేడర్ కంపెనీకి చెందిన వ్యాపారులు కొనుగోలు చేశారు. అనంతరం పత్తి నాణ్యతను చూసే క్రమంలో కాంటాపై తూకం వేశారు. బస్తాలు తూకం చేస్తుండగా.. ఎక్కువ బరువు తూగుతున్నాయి. అనుమానం వచ్చి బస్తాలను కత్తిరించి చూడగా..పత్తి బస్తాల్లో రేషన్ బియ్యం కలుపుకొని వచ్చాడా రైతు. దీంతో అధికారులు ఆశ్చర్యపోయారు. మిగిలిన బస్తాలను కోసి పరిశీలించగా ఒక్కో బస్తాలో 4 నుంచి 5 కిలోల రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించారు. వెంటనే అధికారులు సదరు రైతు పై ఆగ్రహం వ్యక్తం చేసారు. రైతులు ఇలాంటి పనులు చేయకూడదని గిట్టుబాటు ధర కోసం ప్రయత్నించాలని అధికారులు సూచించారు.

కరోనా ఆంక్షలతో ఆర్థికంగా నష్టపోతాం.. ఎక్కువ కేసులున్న చోటే స్ట్రిక్ట్ రూల్స్: మమతా

న్యూఢిల్లీ, డిసెంబర్ 30:కరోనా ఆంక్షలతో ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడుతోందని.. అందుకని ప్రతిచోటా ఆంక్షలు విధించలేమని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ అన్నారు. వచ్చే నెలలో వార్షిక గంగా సాగర్ మేళా ప్రారంభం కానున్న సౌత్ 24 పరగణాల జిల్లాలోని సాగర్ ద్వీపాన్ని సందర్శించిన సందర్భంగా మమతా మీడియాతో మాట్లాడారు.

రైళ్లు, విమాన ప్రయాణికుల రాకపోకలకు సెంటర్ గా ఉన్నందున కోల్‌కతాలో కరోనా కేసులు పెరుగుతున్నాయని అభిప్రాయం వ్యక్తం చేశారు.

"జఐ నుండి విమానాలలో వచ్చేవారిలో చాలా ఒమిక్రాన్ కేసులు గుర్తించాం. ఒమిక్రాన్ క్యారియర్‌లు అంతర్జాతీయ విమానాల ద్వారా వస్తున్నారనేది వాస్తవం. ఇట్లాంటి కేసులు ఎక్కువగా ఉన్న విదేశాల నుండి వచ్చే విమానాలపై ఆంక్షలు విధించడంపై కేంద్రం నిర్ణయం తీసుకోవాలి" అని బెంగాల్ సీఎం మమతా అన్నారు. కాగా, కరోనా న్యూ వేరియంట్ ఒమిక్రాన్ పై తమ ప్రభుత్వం సీరియస్ గానే దృష్టి సారించిందని, అదే విధంగా ఆర్థిక పరిస్థితులను కూడా పరిగణనలోకి తీసుకుని ఆంక్షలకు సంబంధించిన నిర్ణయం తీసుకుంటాం" అన్నారు, "మేము ప్రజల భద్రత, రాష్ట్ర భద్రతను చూసుకోవాలి. త్వరలో దీనికి సంబంధించి ఒక నిర్ణయం తీసుకుంటాం. కేసులు పెరుగుతున్న ఏరియాలను టార్గెట్ గా చేసుకుని ఆంక్షలు విధిస్తాం. కానీ, యావత్ రాష్ట్రమంతా ఆంక్షలు పెట్టాలంటే కష్టం. ఎందుకంటే ఇది గత రెండు సంవత్సరాల లెక్కనే ఆర్థిక వ్యవస్థను తీవ్రంగా ప్రభావితం చేయవచ్చు", అని సీం మమత అన్నారు.

ఉచిత వైద్య..అంబులెన్స్ సేవలను సద్వినియోగం చేసుకోండి

-నగర ప్రజలకు జమియతుల్ ఉలేమా అధ్యక్షుడు ముఫ్తి ఏతేమాధుల్ హఖ్ ఖాస్మి పిలుపు

-నిరుపేదలకు బ్లాంకెట్లు పంపిణీ

కరీంనగర్ డిసెంబర్ 30 (నేటినిజం ప్రతినిధి): జమియతుల్ ఉలేమా ఆధ్వర్యంలో ఉచిత వైద్య..అంబులెన్స్ సేవలను కరీంనగర్ నగర ప్రజలు కుల, మతాలక తీతంగా సద్వినియోగం చేసుకోవాలని జమియతుల్ ఉలేమా కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు ముఫ్తి మహమ్మద్ ఏతేమాధుల్ హఖ్ ఖాస్మి పిలుపునిచ్చారు. గురువారం నగరంలోని ముకరం పుర మదర్సా ఇస్లామీయ అహసన్ ఉల్ ఉలూమ్ లో నగర ప్రజలకు, కుల, మతాలకతీతంగా ఉచిత అంబులెన్స్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు..ఉచిత అంబులెన్స్ సేవలపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించేందుకు నగరంలో వివిధ ప్రాంతాల్లో ప్రధాన చౌరస్తాల్లో..హోటళ్లు, ఆసుపత్రులు, జన సాంద్రత కలిగిన ప్రాంతాల్లో పోస్టర్లను..ప్యాసింజర్ ఆటోల్లోని వెనుక భాగంలో స్టిక్కర్లను అతికించారు. ఇట్టి అంబులెన్స్ సేవలను పొందడానికి ఇంచార్జి హాఫిజ్ వసిముద్దీన్ ను 9989146841ను సంప్రదించాలని కోరారు. ఇక శీతాకాలం దృష్ట్యా..జిల్లాలో చలి తీవ్రత ఎక్కువగా ఉన్నందున నగరంలోని పేద ప్రజలకు జమియతుల్ ఉలేమా కరీంనగర్ శాఖ అండగా నిలిచింది. ఈసందర్భంగా 200 మంది నిరుపేదలకు ఉచితంగా జమియతుల్ ఉలేమా బాధ్యులు బ్లాంకెట్లను అందజేశారు. ఈకార్యక్రమంలో ప్రముఖ ఆర్ అండ్ బి స్పెషల్ క్లాస్ కాంట్రాక్టర్ మహమ్మద్ కమాలుద్దీన్, 52వ డివిజన్ కార్పొరేటర్ అఖీల్ ఫిరోజ్, పికాక్ హోటల్ యజమాని ఎండి. అసగర్ అలీ, ఎంఏ ఖాలీద్, జమియతుల్ ఉలేమా ఉపాధ్యక్షుడు హాఫిజ్ జియఉల్లాహ్ ఖాన్, అంజదుల్లా బేగ్, రిటైర్ పిఈటి బాబర్, గ్రాండ్ హోటల్ జవీక్,సిటీ జమియతుల్ ఉలేమా అధ్యక్షుడు మౌలానా ముజీబ్, హాఫిజ్ మౌజ్జమ్ హుస్సేన్, అబ్దుల్ ఖదీర్ తదితరులు పాల్గొన్నారు.

చైనాలో కరోనా నిబంధనలు - ఉల్లంఘించిన వారిని నగరం చుట్టూ ఊరేగింపు

న్యూఢిల్లీ, డిసెంబర్ 30:ప్రపంచదేశాలని అతలాకుతలం చేస్తుంది. కరోనాతో పాటు ఒమిక్రాన్ కేసులు కూడా అధికమవుతున్నాయి. కాగా చైనాలో ఇప్పటి వరకు ఒమిక్రాన్ కేసులు ఒకటికూడా నమోదుకాకపోవడం విశేషం. అయితే అనారోగ్యంతో ఉన్న వ్యక్తికి సహాయం చేస్తేనే వాహనాలను రోడ్లపైకి అనుమతిస్తామని అక్కడి ప్రభుత్వం వెల్లడించింది. ఈ మేరకు స్థానిక ఆరోగ్య అధికారులు, పోలీసులు కార్లని పరిశీలుస్తున్నారు. కరోనా నిబంధనలను ఉల్లంఘించిన వారికి పది రోజులు జైలు శిక్షతో పాటు , రూ. 5800జరిమానా విధిస్తున్నారు. ఈ మేరకు ప్రజలు ఇళ్లలోనే ఉండాలని ప్రభుత్వం కోరుతుంది. అవసరమైన పనుల కోసం వెళ్లాల్సిన వ్యక్తులు మాత్రమే జియాన్‌లో ప్రయాణించాలని ఆదేశాలను జారీ చేసింది. చైనాలో కోవిడ్ నివారణ కోసం నిబంధనలను కఠినంగా అమలు చేస్తోంది అక్కడి ప్రభుత్వం.

తాజాగా కరోనా నిబంధనలను ఉల్లగించిన వ్యక్తులకు విధించిన బహిరంగ శిక్షలు ప్రముఖ వార్తల్లో చోటు చేసుకున్నాయి. చైనాలోని గ్వాంగ్జీలో కరోనా నిబంధనలను పాటించని నలుగురు వ్యక్తులను అధికారులు అవమానపడేలా శిక్షలు విధించారు. ప్రస్తుతం ఈ వీడియో బయటకి రావడంతో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. చైనా, వియత్నాం మూసివేసిన సరిహద్దుల వద్ద ఈ నలుగురు వ్యక్తులు వలసదారులకు సహాయం చేసి కోవిడ్ నిబంధనలను ఉల్లంఘించారని తెలుస్తోంది.తెల్లటి సూట్లు ధరించిన నలుగురు పురుషులను గ్వాంగ్జీలోని జింగ్సీ నగరం చుట్టూ ఊరేగించారు. ఈ సమయంలో భారీగా ప్రజలు, పోలీసులు కూడా ఉన్నారు. ఈ నలుగురు వ్యక్తులు చిత్రాలు, పేర్లతో కూడిన ప్లకార్డులు పట్టుకుని కనిపించారు. కవాతు చేస్తున్న వీరితో పాటు ఇద్దరు పోలీసు అధికారులు కూడా ఉన్నారు. చైనాలో కఠినమైన కోవిడ్ చట్టాలను అమలు చేస్తున్నారు. ఇప్పటికే డ్రాగన్ కంటే తమ పొరుగు దేశాల సరిహద్దులను మూసివేసింది. చైనా జింగ్సీ నగరం వియత్నాంతో సరిహద్దుగా ఉంది. అయితే ఈ సరిహద్దు ప్రాంతాల్లో కరోనా నిబంధనలను ఎవరు ఉల్లగించినా ఇలా శిక్షకు గురవుతారని..ప్ల కార్డులు పట్టుకుని పరేడ్ చేయాల్సి ఉంటుందని.. స్థానికుల హెచ్చరించినట్లు ప్రాంతీయ వార్తా ఛానెల్ తెలిపింది.

నవాబ్ పేట మండలంలో మంత్రుల సుడిగాలి పర్యటన

రంగారెడ్డి, డిసెంబర్ 30:రాష్ట్ర మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, వేముల ప్రశాంత్ రెడ్డిలు రంగారెడ్డి జిల్లాలో సుడిగాలి పర్యటన చేపట్టారు. జిల్లాలోని చేవెళ్ల నియోజకవర్గం నవాబ్ పేట్ మండలంలో మంత్రులు సుడిగాలి పర్యటన చేశారు. శంకుస్థాపనలు? ప్రారంభోత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఎక్ మామిడి, పుల్ మామిడి, లింగంపల్లి, ఎల్లకొండ, మహేతాబ్ ఖాన్ గూడ గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు విద్యా శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, రోడ్లు భవనాల శాఖ మంత్రి ప్రశాంత్ రెడ్డి శంకుస్థాపనలు చేశారు. జడ్పీ చైర్ పర్సన్ సునీతా రెడ్డి, ఎమ్మెల్యే కాలే యాదయ్య పర్యటనలో పాల్గొన్నారు.

ఎమ్మెల్యే యాదయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాల్లో పలు రోడ్ల పనులకు శంకుస్థాపనలు, నవాబ్ పేట్ జిల్లా పరిషత్ పాఠశాలలో సైన్స్ లాబ్, ఎమ్మార్సీ భవనాలను మంత్రులు సబితా రెడ్డి, ప్రశాంత్ రెడ్డి, జడ్పీ చైర్ పర్సన్ సునీతా రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో రాష్ట్ర విద్య, మౌళిక సదుపాయాల సంస్థ చైర్మన్ నాగేందర్ గౌడ్, అడిషనల్ కలెక్టర్ మోతిలాల్, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరయ్యారు.

కరోనా కేసులు పెరిగినా ఎదుర్కొనేందుకు సిద్ధం - ఎయిమ్స్ డైరెక్టర్ రణదీప్ గులేరియా

న్యూఢిల్లీ, డిసెంబర్ 30:కరోనా కేసులు పెరుగుతు న్నాయి. గతంలో కరోనా సెకండ్ వేవ్ లో ముందస్తుగా ఆక్సిజన్ సిలిండర్లు, మెడిసిన్ ని నిల్వ చేశారు. అంతేకాదు బెడ్స్ ని కూడా బుకింగ్ చేసుకున్నారు. కాగా ఈసారి అలాంటివి చేయవద్దని ఎయిమ్స్ డైరెక్టర్ రణదీప్ గులేరియా తెలిపారు. ఈ మేరకు ఆయన మీడియాతో మాట్లాడారు. దేశంలో కరోనా కేసులు పెరిగినా ఎదుర్కొవడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. కాగా ఇప్పుడు సోకుతున్న ఒమిక్రాన్ వేరియంట్ స్వల్ప లక్షణాలే ఉంటాయని చెప్పారు. అందువల్ల ఆక్సిజన్ సపోర్ట్ అవసరం ఉండకపోవచ్చని తెలిపారు. కాబట్టి ఎవరూ ఆక్సిజన్ సిలిండర్లు, మందులను నిల్వ చేసుకోకూడదన్నారు.కరోనా మహమ్మారి ఇంకా పూర్తిగా తొలగిపోలేదని ప్రజలు అర్థం చేసుకోవాలి. అయితే ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని.. కాకపోతే అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రాబోయే 2022 ప్రతీ ఒక్కరికి సంతోషంగా, ఆరోగ్యంగా, సంపన్నంగా ఉండాలని ఆంకాంక్షించారు. భారతదేశంలో పెద్ద సంఖ్యలో ప్రజలు వ్యాక్సిన్ వేసుకున్నారన్నారు.

భారత్ 113 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికాపై విజయం

ఇండియా వర్సెస్ సౌతాఫ్రికా తొలి టెస్ట్ చివరి రోజున భారత్ కీలక విజయం సాధించింది. దక్షిణాఫ్రికా తొలి సెషన్ లో మూడు వికెట్లు కోల్పోయింది. దక్షిణాఫ్రికాతో సెంచూరియన్ లో జరుగుతున్న తొలిటెస్టులో ఐదో రోజు భారత్ విజయాన్ని సాధించింది. భారత్ తొలి ఇన్నింగ్స్ 327,రెండో ఇన్నింగ్స్ 174. సౌతాఫ్రికా తొలి ఇన్నింగ్స్ 197,రెండో ఇన్నింగ్స్ 191. మూడు టెస్టుల సిరీస్ లో 1-0ఆధిక్యంలో నిలిచింది భారత్. దక్షిణాఫ్రికా 21 పరుగుల వద్ద మహ్మద్ సిరాజ్ చేతిలో క్వింటన్ డి కాక్‌ను కోల్పోయింది, వియాన్ ముల్డర్ కూడా మహ్మద్ షమీ బౌలింగ్ చేయగా వరుసగా ఆరు , ఏడవ వికెట్లను అందించాడు.అంతకుముందు, డీన్ ఎల్గర్ చివరకు 77 పరుగుల వద్ద బౌటయ్యాడు, జస్ప్రీత్ బుమ్రా అతని చేతిలోకి వచ్చిన బంతితో బ్యాటర్ ఎల్‌బిడబ్ల్యులో చిక్కుకున్నాడు, టీమ్ ఇండియాకు 5వ రోజు మొదటి పురోగతిని అందించాడు. బుమ్రా , మహ్మద్ షమీ వంటి వారిపై సానుకూల గమనికతో.సెంచూరియన్‌లోని సూపర్‌స్పోర్ట్ పార్క్‌లో దక్షిణాఫ్రికాతో మూడు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్‌లో కీలకమైన 1-0 ఆధిక్యం సాధించడానికి టీమ్ ఇండియా విజయం సాధించాలని లక్ష్యంగా పెట్టుకుంది. కాగా భారత్ 113పరుగుల తేడాతో దక్షిణాఫ్రికాపై విజయాన్ని సాధించింది.

రాజన్న నిత్యాన్నదాన ట్రస్టుకు 2లక్ష రూపాయిల విరాళం



రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 30(నేటినిజం ప్రతినిధి):రాజన్న ఆలయ శ్రీ రాజ రాజేశ్వర నిత్యాన్నదాన ట్రస్టుకు వేములవాడ పట్టణం నకు చెందిన నగుబోతు విష్ణు వారి తండ్రిగారైన కి. శే లు నగుబోతు నందయ్య స్మారకార్థం నిత్యా అన్నదానం నాకు 2 లక్ష రూపాయలు ఆలయ ఈఓ డి.కృష్ణప్రసాద్ కు అందజేసినారు .వీరి వెంట ఆలయ ఏ ఈ ఓ బి శ్రీనివాస్,పర్యవేక్షకులు సిరిగిరి శ్రీరాములు, అన్నదాన ట్రస్ట్ ఇంచార్జి పేరుక శ్రీనివాస్ ఉన్నారు.

డాబర్ వీటాతో హెల్త్ ఫుడ్ డ్రింక్ విభాగంలో ప్రవేశించిన డాబర్

హైదరాబాద్, డిసెంబర్ 30:భారతదేశంలో సుప్రసిద్ధ ఆయుర్వేదిక్, నేచురల్ హెల్త్‌కేర్ కంపెనీ డాబర్ ఇండియా లిమిటెడ్ నేడు డాబర్ వీటా ఆవిష్కరణతో తాము హెల్త్ ఫుడ్ డ్రింక్ విభాగంలో ప్రవేశించినట్లు వెల్లడించింది. ఇది 30కు పైగా ఆయుర్వేద వనమూలికలు అయినటువంటి అశ్వ గంధ, గిలోయ్, బ్రహ్మి తదితరాలతో తయారైంది. ఇవి రోగ నిరోధక శక్తిని అత్యుత్తమంగా అందించడంతో పాటుగా శారీరక, మానసిక ఆరోగ్యాన్ని సైతం చిన్నారులలో మెరుగుపరుస్తాయని శాస్త్రీయంగా నిరూపించబడింది.

"నాణ్యత, నమ్మకం మరియు 137 సంవత్సరాల అనుభవమనే డాబర్ వారసత్వంపై ఆధారపడి డాబర్ వీటా రెండు రెట్ల అత్యున్నత ప్రయోజనాలను ఎదుగుదల మరియు రోగ నిరోధక శక్తి పరంగా అందిస్తుంది. అంతేకాదు ఇతర మిల్క్ ఫుడ్ డ్రింక్స్‌తో పోలిస్తే మహోన్నతమైన రుచిని సైతం ఇది అందిస్తుంది. ఈ?కామర్స్‌లో ఇటీవలి కాలంలో రోగ నిరోధక శక్తిని పెంచే పాల పానీయాలను గురించి వెదకడం చూస్తున్నాము. ఇప్పుడు వృద్ధి చెందుతున్న వినియోగదారుల సమకాలీన అవసరాలను డాబర్ వీటా తీర్చనుంది. ఇప్పుడు ఫ్లిప్‌కార్ట్‌తో భాగస్వామ్యం చేసుకుని దీనిని ఆవిష్కరించడం పట్ల సంతోషంగా ఉన్నాము. ఆరోగ్య విభాగంలో మా జాబితాను డాబర్ వీటా మరింత విస్తృత పరచనుంది" అని డాబర్ ఇండియా లిమిటెడ్ బిజినెస్ హెడ్ ఈ?కామర్స్ స్మెర్త్ ఖన్నా అన్నారు. "నీల్సన్ ఇటీవల నిర్వహించిన అధ్యయనం ప్రకారం, దాదాపు 88% మంది తల్లులు హెల్త్ డ్రింక్‌లలో రోగ నిరోధక శక్తి మెరుగుపరిచే ప్రయోజనాలను గురించి ఎక్కువగా చూస్తున్నారు. మహమ్మారి అనంతర ప్రపంచంలో వినియోగదారుల అవసరాలను గుర్తెరిగి డాబర్ ఇండియా లిమిటెడ్ వద్ద ఈ వినూత్నమైన ఉత్పత్తిని తీర్చిదిద్దాము. మార్కెట్‌లో ఇతర హెల్త్ డ్రింక్‌లతో పోలిస్తే మెరుగైన రోగ నిరోధక శక్తిని ఇది అందిస్తుంది.ఆయుర్వేద ప్రయోజనాలను రుచికరమైన చాక్లెట్ డ్రింక్‌లో అందిస్తుంది" అని ప్రశాంత్ అగర్వాల్, మార్కెటింగ్ హెడ్? హెల్త్ సప్లిమెంట్స్, డాబర్ ఇండియా లిమిటెడ్ అన్నారు.ఈ?కామర్స్‌లో డాబర్ వీటా ఆవిష్కరించడం కోసం ఫ్లిప్‌కార్ట్‌తో డాబర్ ఒప్పందం చేసుకుంది. చాక్లెట్ ఫ్లేవర్‌లో 7 ఎస్‌కెయుల 15గ్రాముల పౌచ్ 10 రూపాయలకు, 75 గ్రాముల పౌచ్ 30 రూపాయలు, 200 గ్రాముల బిబ్ 120 రూపాయలకు లభిస్తుంది. అయితే ప్రారంభ ధరగా దీనిని 99 రూపాయలకు, 500 గ్రాముల బిబ్‌ను 235 రూపాయలు, 500గ్రాముల జార్‌ను 249 రూపాయలు, 750 గ్రాముల పౌచ్ 340 రూపాయలు, 1కేజీ బిబ్‌ను 430 రూపాయలకు అందిస్తున్నారు. "ఆరు నుంచి 15 సంవత్సరాల చిన్నారుల మెదడు ఆరోగ్యం మెరుగుపరచడంలో ఈ డ్రింక్ తోడ్పడుతుంద"ని డాబర్ ఇండియా లిమిటెడ్ వైస్ ప్రెసిడెంట్? మార్కెటింగ్ రాజీవ్ జాన్ అన్నారు.

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas.
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.